
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 24.06.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

అవసరమున్న పని చేస్తే విజ్ఞత అవుతుంది. అనవసరమైన పనిచేస్తే అజ్ఞానమవుతుంది. ఒక్కోసారి మేధావులు కూడా అజ్ఞానాంధకారంలో పడి, తాము జ్ఞానసాగరంలో పయనిస్తున్నామన్న భ్రమలో ఉంటారు. రాష్ట్ర రాజకీయాలలో నెంబర్ వన్ ర్యాంక్ మేధావి చంద్రబాబునాయుడు కూడా ఇలాంటి భ్రమల్లోనే ఉన్నాడా... అనిపిస్తోంది.



## ఇప్పుడే ఎన్నికలు పెడితే...

# అందరూ ఔట్!

- ఫిరాయింపు ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో సర్వే చెప్పిన నిజాలు
- ఒక్క చోట తప్ప అన్ని చోట్లా ప్రతికూల ఫలితాలు

రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని ప్రజలు పట్టించుకోకుంటే ప్రభుత్వం బలపడుతుంది. అధికారంలో వున్న పార్టీయే మళ్ళీ మళ్ళీ అధికారంలోకి వస్తుంది. కాని ప్రతిపక్షాన్ని బలహీనపర్చాలనే అధికార పార్టీ ప్రయత్నం చేసే కొద్దీ అది ఇంకొంచెం బలపడుతుంది.

ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని నామరూపాలు లేకుండా చేయాలన్న తలంపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన ఎమ్మెల్యే ఫిరాయింపు సంస్కృతి ఆయనకే నష్టం కలిగించబోతుందా? ఇది ప్రతిపక్ష వైకాపాకే ప్రయోజనంగా మారబోతుందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు వచ్చాయి. చంద్రబాబు ఆకర్షణ ఆఫర్లకు ప్రభావితులై 20మంది ఎమ్మెల్యేలు (మిగతా 11వ పేజీలో)



# వన్‌షాట్... 20 హిట్స్

- పిఎస్ఎల్‌వి-సి34 సూపర్ సక్సెస్
- ఒకేసారి నింగిలోకి 20 ఉపగ్రహాలు
- అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో అరుదైన విజయం

12లో



# ఇద్దరూ ఇద్దరే

## అవినీతికి అన్నదమ్ములే



- ఆనం అవినీతి గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వుంది
- నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అంటున్న అజీజ్

***ఈ** నగరంలో నాయకులకు ఏమైంది... ఒకరు అవినీతి గురించి మాట్లాడుతున్నారు... ఇంకొకరు అక్రమాల గురించి ప్రశ్నిస్తున్నారు. నువ్వు అవినీతిపరుడివంటే... నువ్వే పెద్ద అవినీతిపరుడివంటూ ఒకర్నొకరు వేలెత్తి చూపించుకుంటున్నారు. వీళ్లకు ఏమైంది... అసలు వీళ్లు అవినీతి గురించి మాట్లాడడమేమిటి? అవినీతిపై ప్రశ్నించడమేమిటి? వినడానికే రోతగా వుంది. అవినీతి గురించి వీళ్లు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వుంది. ఐసిస్ చీఫ్ ఆల్‌బాగ్దాదీ శాంతి ప్రవచనాలు చెప్పినట్లుగా వుంది.*

నెల్లూరు నగరపాలక సంస్థలో నెలకొన్న అవినీతిపై ఓ పక్క మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చేస్తున్న విమర్శలు... ఇంకోపక్క మేయర్ అబ్దుల్ అజీజ్ చేస్తున్న కౌంటర్ ఎటాక్ చూస్తూనే వున్నాం. నగరపాలక సంస్థ అవినీతి మయమైపోయిందంటూ మేయర్ అజీజ్‌ను టార్గెట్‌గా చేసుకుని వివేకా చేసిన తీవ్రమైన ఆరోపణలు చూసాం. కార్పొరేషన్‌ను భ్రష్టు పట్టించారంటూ ఆయన మొసలికన్నీరు కార్చడం మీడియా ద్వారా లోకమంతా చూసింది. అయితే కార్పొరేషన్ అవినీతిమయమైపోయిందంటూ వివేకా విమర్శించడం 'గురివింద గింజ తన నలుపెరుగదు' అన్న సామెతను గుర్తు చేస్తుంది.

అసలు నెల్లూరు నగరపాలక సంస్థను ఈ విధంగా తయారు చేసిపెట్టింది, ఈ విధంగా భ్రష్టు పట్టించింది, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చింది వివేకా కాదా! కార్పొరేషన్‌లో ప్రతి అనైతిక చర్యకు అక్రమాల పరంపరకు ఆయన హయాంలోనే అంకురార్పణ జరిగింది.

స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి నుండి టి.రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ పాలన వరకు నెల్లూరు మున్సిపాల్టీ కొంత పద్ధతిగానే వుండింది. ఈమధ్యలో 1995 నుండి 1999వరకు వివేకానే మున్సిపల్ ఛైర్మెన్‌గా పని చేశారు. అప్పుడు కూడా కొంచెం పద్ధతిగానే నడిచింది. 2005లో నెల్లూరు మున్సిపాల్టీ నగర పాలక సంస్థగా (మిగతా 11వ పేజీలో)



# నిబంధనల ప్రకారం వేతనాలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఎ.ఎండి. ఇంతియాజ్

జిల్లాలో రైస్‌మిల్లర్లలో పని చేస్తున్న వర్కర్లకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి. ఇంతియాజ్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు వీడియో కాన్ఫరెన్స్ హాలులో వర్కర్లకు సంబంధించిన వేతనాలపై కార్మిక శాఖ డిప్యూటి కమిషనర్ ప్రసాదరావు సమన్వయంతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రైస్ మిల్లర్లలో పనిచేస్తున్న వర్కర్లకు లేబర్ యాక్ట్ ప్రకారం వేతనాలు చెల్లించడంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, మిల్లర్ల ప్రతినిధులు సమన్వయంతో సమీక్షించుకొని చట్టప్రకారం వర్కర్లకు న్యాయపరమైన వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ధర్మారెడ్డి, జిల్లా మేనేజర్ కొండయ్య, నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, విజిలెన్స్ అధికారి వెంకటసుబ్బయ్య, కార్మిక సంఘాల ప్రతినిధులు, రైస్ మిల్లర్లకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.


# లోడింగ్‌కు బ్రేక్..విక్రయాలకు షాక్

## • వివాదాల సుడిలో పామాయిల్ ఫ్యాక్టరీలు

జిల్లాలోని ముత్తుకూరు మండలం పారిశ్రామిక ప్రగతిలో ముందంజ వేస్తున్నప్పటికీ, మధ్యమధ్యలో వచ్చే అంతరాయాల వల్ల అభివృద్ధికి అవరోధం కలుగుతోంది. ఆధిపత్య పోరులో పరిశ్రమల యాజమాన్యాలు నలిగిపోతున్నాయి. పాలకులు, అధికారులు పట్టించుకోకపోతే ఈ పరిణామాలు మరింతగా పెచ్చరిల్లిపోయి చివరికి వివాదాలమయంగానే ఈ ప్రాంతం నిలిచి పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా కృష్ణపట్నం బైపాస్‌రోడ్డు మార్గం వెంబడి వున్న పామాయిల్ ఫ్యాక్టరీలో లోడింగ్ ప్రక్రియలో స్థానిక ఆయిల్ ట్యాంకర్ సొంతదారులు, స్థానికేతర ఆయిల్‌ట్యాంకర్ల యజమానుల మధ్య వివాదం చెలరేగింది. దీంతో రెండవరోజు నుంచి పామాయిల్ లోడింగ్ ప్రక్రియ నిలచిపోయింది. ఈ పరిధిలో ఏడు పామాయిల్ ఫ్యాక్టరీలు వున్నా ఏ ఒక్క ఫ్యాక్టరీకి కూడా పామాయిల్ లోడింగ్ జరగలేదు. దీంతో పామాయిల్ విక్రయాలు స్తంభించిపోయాయి. ఈ వారం రోజుల్లోనే ఈ గొడవలతో పామాయిల్ పరిశ్రమల యాజమాన్యాలకు దాదాపు రెండు కోట్ల రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు చెప్తున్నారు. ఎప్పుడూ రణగొణధ్వనులతో తిరుగాడే ట్యాంకర్లు ఎక్కడివక్కడ నిలిచిపోవడంతో ఈ ప్రాంత




మంతా కళావిహీనంగా.. స్తబ్ధంగా వుంది. మునుపటి సందడి కనిపించడం లేదు. స్థానికంగా వున్న ఎడిబుల్ ఆయిల్ యూనియన్, కృష్ణపట్నం ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్స్ అసోసియేషన్‌ల మధ్య ఏర్పడిన వివాదం అంతకంతకీ ముదురుతుండడంతో సర్వత్రా ఆందోళన కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితులన్నిటనీ సమీక్షంచి తగు చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ సమాయత్తమైనట్లు తెలుస్తోంది.




## రైతు సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ లక్ష్యంతోనే ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని మాజీమంత్రి, టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని కొత్తవెల్లంటి గ్రామంలో సోమవారం జరిగిన 'ఏరువాక పున్నమి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి రైతులను సమాయత్తం చేసేందుకు, వారికి అన్నివిధాల ప్రోత్సాహించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పి.రాంగోపాల్, ఆనం జయకుమార్‌రెడ్డి, ఎంపిడిఓ వసుమతి, ఏడిఏ సత్యవాణి, ఏ.ఓ చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోస్టుగార్డు ఏసీగా లోకేష్

కోస్టుగార్డు అసిస్టెంట్ కమాండెంట్‌గా నెల్లూరుజిల్లా నాయుడుపేటకు చెందిన సిహెచ్ లోకేష్ ఎంపికయ్యాడు. నాయుడుపేట పట్టణంలోని అగ్రహారం పేటకు చెందిన లోకేష్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 14వ ర్యాంకు పొందాడు. ఈ నెల 24న కేరళలోని ఇజమల ఇండియన్ నావీలో శిక్షణ నిమిత్తం వెళ్ళనున్నాడు. లోకేష్ తండ్రి సిహెచ్ పాండు ఓజిలి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు.

## మానవత్వం వెల్లివిరిసింది...

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మృతి చెందిన వానరానికి సాంప్రదాయ బద్ధంగా ఖననం చేసిన సంఘటన మంగళవారం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక శాంతినగర్‌లో తిరుగాడే ఓ వానరం ఓ గోడపైకి ఎక్కి కూరగాయలు తింటుండగా ఓ కాకి వచ్చి కూరగాయలు తీసుకెళ్ళేందుకు ప్రయత్నించింది. దీంతో కాకిని తరిమే ప్రయత్నంలో వానరం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందడంతో స్థానికులు వానరాన్ని సాంప్రదాయ బద్ధంగా బంతిపూలతో ఊరేగించి ఖననం చేశారు.

### కార్పొరేషన్...

# అవినీతికి కో-ఆపరేషన్



మునిరత్నంను విచారిస్తున్న ఏసిబి అధికారులు

- పక్కాగా చిక్కిన ఏసిపి
- కమిషనర్‌పై బిగుస్తున్న ఉచ్చు

విచ్చలవిడి అవినీతికి నమ్మకమైన చిరునామా నెల్లూరు నగరపాలక సంస్థ. నెల్లూరులోని ముదురుదోమలు కేవలం నెల్లూరీయుల రక్తాన్ని మాత్రమే తాగుతుంటాయి. కాని నెల్లూరు నగరపాలకులు, నగర పాలక సంస్థ అధికారులు రక్తాన్నే కాదు, ఎముకలను కూడా మిగల్చకుండా మాంసాన్ని కూడా తింటుంటారు. ముదురుదోమల నుండి కాపాడుకోవడానికి ఫాగింగ్, కాయిల్స్, ఆలౌట్ వంటి సౌకర్యాలన్నా ఉన్నాయి. కానీ పాలకులు, అధికారుల అవినీతి నుండి తప్పించుకోవడానికి ప్రజలకు ఎటువంటి మందులు అందుబాటులో లేవు. ఉన్న అవకాశమల్లా అవినీతి నిరోధక శాఖ వారిని ఆశ్రయించడమే! అయితే వాళ్లు మాత్రం ఎంతమందినని పట్టుకుంటారు. ఎన్ని సార్లని పట్టుకుంటారు. నెల్లూరు నగర పాలక సంస్థలో అవినీతిని అరికట్టాలంటే ప్రత్యేకంగా ఇక్కడ ఒక ఏసిబి ఆఫీసును పెట్టి ఒక డిఎస్పీని, ఇద్దరు సిఐలను నియమించాల్సి ఉంటుంది.

నగరపాలక సంస్థలో ప్రతిపనికీ అధికారికంగా ఒక రేటు, అనధికారికంగా మరో రేటు వుంటుంది. అధికారికంగా వున్న రేట్లు మారవేమోగాని, అనధికారిక రేట్లు మాత్రం మారుతుంటాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు రెండింతలైనట్లే ఈ మధ్య మన కార్పొరేషన్ వాళ్లు కూడా లంచాల రేట్లను అమాంతం పెంచేశారు. నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, హెల్త్ విభాగాలలో అవినీతి విచ్చలవిడిగా రాజ్యమేలుతుంది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో అయితే అవినీతి మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇళ్లు కట్టుకోవాలన్నా లంచం... పడగొట్టుకోవాలన్నా లంచం... లంచం లేనిదే మంచమెక్కని కార్పొరేషన్ అధికారగణం వేధింపులతో విసిగిపోయిన అమాయక బాధితులు అప్పుడప్పుడు ఏసిబిని ఆశ్రయిస్తుంటారు. అలాంటి అమాయక బాధితుడే ఇటీవలే ఏసిబి అధికారులను ఆశ్రయించడం, ఏసిబి అధికారులు జరిపిన దాడిలో అసిస్టెంట్ సిటీప్లానింగ్ ఆఫీసర్ మునిరత్నం 50వేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడం, ఏసిబి వాళ్లు తమదైన శైలిలో అతనిని ప్రశ్నించడంతో ఇందులో కమిషనర్‌కు వాటా ఉందంటూ అతను చెప్పేయడంతో... ఈ అవినీతి కథకు ఇంకా ముగింపు దొరకలేదు.

నెల్లూరు, బి.వి.నగర్‌కు చెందిన కె.శ్రీధర్ తన సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ప్లాన్ అప్రూవల్ కోసం కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ఆరు నెలలుగా తిరుగుతున్నాడు. అప్రూవల్ కోసం ఏసిపి మునిరత్నం 50వేలు డిమాండ్ చేశాడు. ఇది ఇష్టం లేని శ్రీధర్ ఏసిబిని ఆశ్రయించడం, ఏసిబి ఇచ్చిన డైరెక్షన్ ప్రకారం ఈ నెల 19వ తేదీన బారాషహీద్ దర్గా వద్ద ఏసిపి మునిరత్నంకు 50వేలు లంచం ఇస్తుండగా అక్కడే మాటువేసి వున్న ఏసిబి అధికారులు మునిరత్నంను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసిబి విచారణలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలీ ఇంట్లో 5.32 లక్షలు ఉన్నాయని తేలడంతో ఆ నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. బూత్ లెవల్ అధికారులకు చెల్లించడానికి బ్యాంకు నుండి డ్రా చేసిన ఈ నగదును కమిషనర్, అతని సి.సి రాజేంద్రలు ఆలీ ఇంట్లో ఎందుకు దాచారన్నదానిపై ఏసిబి అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఇక మునిరత్నంను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అతనిని రిమాండ్‌కు ఆదేశించారు.

**కమిషనర్ పాత్రపై ఆరా...**

బాధితుడు శ్రీధర్ కమిషనర్ కూడా అవనీతిపరుడేనని చెప్పాడు. ఇక రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన మునిరత్నం కూడా తీసుకున్న లంచం కమిషనర్‌కేనని వెల్లడించాడు. ఈ అవినీతిలో కమిషనర్ పాత్ర ఎంతుందనేదానిపై రాజేంద్ర, ఆలీలను కూడా ఏసిబి అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

## సీఎంను కలిసిన 'విజయ' ఛైర్మెన్



ఈ నెల 21వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రంలోని అన్ని జిల్లాల డెయిరీ ఛైర్మెన్లు, మేనేజింగ్ డైరెక్టర్ల సమావేశం జరిగింది. వ్యవసాయశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. నెల్లూరుజిల్లా నుండి విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఈ సమావేశానికి హాజరై జిల్లాలో పాడిపరిశ్రమ పురోభివృద్ధికి తాము చేపడుతున్న చర్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విజయ డెయిరీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు సీఎంకు తెలిపారు.







### సినీ సంగీత దర్శకులు సాయి కార్తీక్‌కు

# కళాంజలి పురస్కారం



కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాయి కార్తీక్‌కు ఈ ఏడాది కళాంజలి పురస్కారం అందజేయనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వతేదీ ఆదివారం సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందజేస్తారు. సంస్థ గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు అధ్యక్షతన 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సినీహీరో నారా రోహిత్ విశిష్ఠ అతిథిగా, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, యువ సేవాభిలాషి మాగుంట శరత్‌చంద్రారెడ్డి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వెంకటరవికుమార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 'పాడుతా తీయగా' గాయనీగాయకులచే సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నారు.

# 'ప్రభా'తం

'యోగ'...ఈ రెండక్షరాలు ఇప్పుడు ప్రపంచంలో మారుమ్రోగిపోతున్నాయి. ఎక్కడ చూసినా.. ఎక్కడ విన్నా ఇదే మాట. దేశమేదైతేనేం.. ప్రాంతమేదైతేనేం..అవని అంతా అన్నిచోట్లా ఈ మాటే.. ఒక మంత్రంగా మోగుతోంది. 'యోగ'.. ఇది కొందరికి జీవనవేదంగా..మరికొందరికి ఆరోగ్యనాదంగా.. మొత్తంగా ప్రపంచానికంతటికీ ఇది ఇప్పుడు సరికొత్త చైతన్య నినాదంగా దద్దరిల్లుతోంది. ఎందుకంటే, 'యోగ' అనేది ఒక దీపశిఖ లాంటిది. ఒక్కసారి వెలిగిస్తే చాలు.. జీవితమంతా వెలుగులు చిందించే అఖండజ్యోతి ఇది..మానవజీవితానికిదో వరం. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో యోగశాస్త్రం ఒక భాగం. మనిషి అంత:కరణ దృష్టిని పెంపొందించుకోవడంతో పాటు, మానసిక పరివర్తనను సాధించుకునేందుకు ఉపయోగపడే ఒక సాధనం. నేటి యాంత్రిక ప్రపంచంలో సైతం మానవునికి ప్రశాంతతను, ఏకాగ్రతను..మంచి ఆరోగ్యాన్ని, మంచి ఆలోచనలను అందించే ఒక దివ్యౌషధం. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రపంచానికి భారత్ ఇచ్చిన ఒక అపురూపమైన కానుక..'యోగ'. ఎప్పుడో వేనవేల సంవత్సరాల క్రితమే మన మునులు, పతంజలి వంటి మహర్షులు 'యోగ' విశిష్టతను లోకానికి చాటారు. జన్మజన్మల పరంపరకు కారణమైన చిత్తవృత్తులను నిరోధించి జనన మరణ చక్రం నుంచి మానవుడిని ఉద్ధరించేది.. యోగ అని యోగసూత్రాల్లో పతంజలి మహర్షి పేర్కొన్నారు కూడా. యోగాసనాలు వేయడమంటే.. అదేదో వ్యాయామం చేయడం కాదు. మనసును దేహాన్ని సమ్మిళితం చేసి అంత:కరణ శుద్ధిని సాధించడమే.. యోగ సాధన పరమార్థం. భారతదేశంలో మహర్షుల మహత్తర సాధనతో సాకారం దాల్చిన అపూర్వమైన.. అద్భుతమైన శక్తి.. దివ్యశక్తి.. 'యోగ' అనే చెప్పవచ్చు. ఇదిప్పుడు విశ్వవ్యాప్తం కావడమంటే.. మనదేశ ఆధ్యాత్మిక సంప్రదాయానికే ప్రపంచవ్యాప్త గుర్తింపు.. గౌరవం దక్కడమన్న మాట. మన 'యోగ'కు..అంతటి మహాయోగం కలగడం నిజంగా భారతీయులంతా గర్వించదగ్గ విషయం. భావితరాలవారికి ఇదో భవ్యమైన దిక్సూచి కానుంది. సకల మానవాళి దైహిక ఆరోగ్యానికి, మానసిక వికాసానికి, ఆధ్యాత్మికత ఫరిడవిల్లడానికి..తద్వారా లోకకళ్యాణానికి ఇది వెలుగుబాటలు పరుస్తుంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా, భారత ప్రధాని నరేంద్రమోడీ సంకల్పంతో 'యోగ'కు మరింతగా ప్రపంచవిఖ్యాతి కలిగిందంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలోని 135 దేశాల్లో 'యోగ' కాంతులు తేజరిల్లాయి. దేశవిదేశాల్లో కోట్లాదిమంది ప్రజలు యోగసాధనలో నిమగ్నమైన ఒక అపూర్వమైన 'చిత్రం'..అవని యవనికపై యోగముద్రాంకితం కావడం ప్రపంచమే విస్తుపోయే పరమాద్భుతమైన దృశ్యం. ఇంతటి సుదినాన ఈ అద్భుతకార్యావిష్కరణకు సంకల్పించడం..భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని నరేంద్రమోడీ యోగాసీనులు కావడం మరో అద్భుతం. మైనస్‌డిగ్రీ ఉష్ణోగ్రతలతో మంచుగడ్డలా తలపించే సియాచిన్ పర్వత ప్రాంతాల్లోను, అగ్నిగుండంలా వుండే రాజస్థాన్ ఎడారి ప్రాంతాల్లోనూ, యుద్ధనౌకలపై మహాసాగర ప్రాంతాల్లోనూ సైనికులు, జవాన్లు యోగసనాలతో సంచలనం సృష్టించారు. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం కూడా ఇదే సందర్భంలో యోగ ముద్రలతో ప్రకాశించడం మరో విశేషం. యావద్భారత దేశంలోనే కాదు.. ప్రపంచం నలుమూలలనుంచీ సకల మానవాళి అంతా ఎన్నో ప్రాంతాల్లో.. ఎంతో ఉత్సాహంతో.. చిన్నా పెద్దా.. ప్రజలు.. మంత్రులు, నేతలు..ప్రముఖులు అందరూ ఒక్కసారిగా యోగాసనాలు వేసి 'యోగ'కు ఇంతటి అపూర్వమైన ఖ్యాతిని తీసుకురావడం చూస్తే.. నాటి మహర్షుల కల..నేటి మన నేతల చిరకాల స్వప్నం ఇంతకాలానికి సాకారమైనట్లేనని భావించవచ్చు. చండీగఢ్‌లో 30 వేల మందితో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడి యోగాసనాలు వేసి మార్గదర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'యోగ'..అనేది సమగ్ర జీవన సాధనకు గొప్ప మార్గమని, శరీరం-మనసు-మేధస్సు-ఆత్మ అన్నీ సమన్వయంతో సాగేలా శిక్షణ ఇస్తుందని, యోగాను అందరూ నిత్యజీవితంలో భాగంగా మార్చుకోవాలని ఉద్బోధించిన మాటలు మనదేశానికే కాదు, సకల మానవాళికీ ఎంతైనా స్ఫూర్తిదాయకం. దేశవ్యాప్తంగానే కాక యునైటెడ్ ఎమిరేట్స్, ట్యునీషియా, సూడాన్, వెనెజులా, కొలంబియా, గ్వాటిమాలా, ఉరుగ్వే, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి అనేకానేక దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లోనూ యోగ దినోత్సవాన్ని అత్యద్భుతంగా నిర్వహించారు. అంతేకాదు, యోగ పితామహునిగా ప్రఖ్యాతిగాంచిన పతంజలి జన్మస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని గోండాజిల్లా కోడార్ గ్రామంలోనూ యోగ సందడి కనిపించిందంటే.. ఆ మహనీయుని విశిష్టతను మనం మరోసారి మననం చేసుకున్నట్లే. ఇంతటి విశేషమైన యోగ..మనసుకు-దేహానికి సంబంధించిన ఒక విజ్ఞాన శాస్త్రమైన యోగ.. ఇప్పుడు ఒక విశ్వచైతన్య మహాతరంగంలా, సమాజంలో ఐక్యతను సాధించే ఒక బృహత్సాధనంలా.. వసుధైక కుటుంబ స్ఫూర్తిని కలిగించే భవ్య..దివ్యామృతంలా 'యోగ' అందరినీ ఉద్దీపింపజేస్తోంది.

ప్రజల్లో శాంతి సామరస్యాలను, ప్రశాంత వాతావరణాన్ని, మంచి ఆరోగ్యాన్ని పెంపొందింపజేసే యోగ.. ఎల్లలే లేని ఒక సుహృద్భావ జీవనసాధనా తరంగం అని వేరే చెప్పనక్కర లేదు. సంపూర్ణ ఆరోగ్యానికి.. మానసిక వికాసానికి, సామాజిక ఐక్యతకు.. అన్నిటికీ మించి మనసుకు ప్రశాంతతనిచ్చే పరమౌషధం.. యోగ ఒక్కటే. అందుకే యోగకు అవని అంతా అపూర్వంగా స్పందిస్తోంది. ఇంతటి దివ్యమైన 'యోగ'కు..శతసహస్ర వందనాలు. కాగా, అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ఈ రెండవ ఏడాదిని పురస్కరించుకుని సూర్యనమస్కారాలతో రూపొందించిన తపాలా బిళ్లను ప్రధాని మోడీ విడుదల చేయడం ఎంతైనా అభినందనీయం.. సందర్భోచితం కూడా.

## మహో 'యోగ'ం

ప్రాచీనకాలంలోని మన మహర్షుల మహత్తర సాధనతో సాకారం దాల్చిన అపూర్వమైన శక్తి..'యోగ'. ఇదిప్పుడు విశ్వవ్యాప్తం కావడమంటే.. మనదేశ ఆధ్యాత్మిక సంప్రదాయానికే ప్రపంచవ్యాప్త గుర్తింపు..గౌరవం దక్కడమన్న మాట. మన 'యోగ'కు..అంతటి మహాయోగం కలగడం భారతీయులంతా గర్వించదగ్గ విషయం. యోగ..ఒక విశ్వ చైతన్య మహాతరంగంలా.. వసుధైకకుటుంబ స్ఫూర్తిని కలిగించే దివ్యామృతంలా భాసించడం అపూర్వం.. ఆనందకరం.



# కమనీయం శ్రీవారి కళ్యాణం

వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలతో, మేళతాళాలతో, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణోత్సవం, పుష్పయాగం భక్తులను కనువిందు చేశాయి. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచార పరిషత్, శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, లక్ష్మీపురంలోని ఎస్‌బిఎస్ కళ్యాణ మండపంలో వేదపండితుడు ఫణిశర్మ, అర్చక బృందం శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మహోత్సవ సేవాసమితి అధ్యక్షులు ఇ.కె.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా బలరామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, హిందూధర్మ ప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు, గాయకుడు వినోద్‌కుమార్ ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి. కళాదీప్తి డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులందరినీ ఆకట్టుకున్నాయి.

# చైతన్యజ్యోతి విద్యాసామాగ్రి




బడిబైట పిల్లల్ని బడిలో చేర్పించాలనే సదుద్దేశ్యంతో సేవ్ ద చిల్డ్రన్ సహకారంతో చైతన్యజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో 149 మంది పిల్లలకు ఈ నెల 18న విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఇఓ ఇస్మాయిల్ చెన్నూరు గ్రామం దళితవాడ ప్రాథమిక పాఠశాల-1, పాఠశాల-2లో వున్న వారికి విద్యాసామాగ్రిని పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ సేవా సంస్థలు పిల్లలకు విద్యాసామాగ్రిని అందించడం వల్ల పిల్లల్లో చదువుకోవాలన్న ఉత్సాహం పెరుగుతుందన్నారు. తద్వారా బడి బైట పిల్లలు కూడా బడిలోకి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రావణి, చెన్నూరు సర్పంచ్ శివకుమార్, చైతన్యజ్యోతి కో-ఆర్డినేటర్ మీరా మొహిద్దీన్, ప్రకాశం, జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

# యంపిహెచ్‌డబ్ల్యూ కోర్సుకు దరఖాస్తులు

కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్‌ఫేర్ ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు 2016-17 విద్యా సంవత్సరానికి గాను మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్(స్త్రీ) ట్రైనింగ్ కోర్సుకు నెల్లూరుజిల్లాలోని వివిధ ప్రైవేటు యంపిహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) ట్రైనింగ్ కళాశాల మహిళా అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు యంపిహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) సెలక్షన్ కమిటి ఛైర్మెన్ ఒక ప్రకటనలో కోరారు. ఇందుకు సంబంధించిన వివరాలు అధికార వెబ్‌సైట్ http//cfw.ap.nic.in నుంచి పొందాలని కోరారు. జూలై 4వ తేదీలోగా దరఖాస్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నెల్లూరుకు చేరాలని కోరారు. అభ్యర్థులు జూలై 8వ తేదీ ఉదయం 8గంటలకు నెల్లూరు సంతపేట డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

# నేత్రదానం



నెల్లూరు గిడ్డంగివీధి చిన్నబజార్ కాపురస్తుడు దేవతి వెంకటవరదయ్య ఈ నెల 17వ తేదీన పరమపదించారు. ఆయన కుటుంబసభ్యుల కోరిక మేరకు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డా॥ పి.ఎల్.రావు సారథ్యంలో ఐ టెక్నిషియన్ ఎం.డి.పి.ప్రసాద్ వరదయ్య నేత్రాలను సేకరించాడు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్, దేవతి శేషయ్య, మెంటా రాంమోహన్, విడుపులపాటి సురేష్, జి.వి.సురేష్‌బాబు, నేత్రదాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# రాజకీయ వ్యభిచారమే!

ఒక పార్టీ గుర్తు మీద గెలిచినవాళ్లు ఇంకో పార్టీలోకి వెళితే వెంటనే వారు ఆ పార్టీ ద్వారా పొందిన పదవిని కోల్పోయే విధంగా చట్టం తీసుకురావాలని కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చేసిన సూచన ఎంతైనా అభినందనీయం. ఒక పార్టీలో గెలిచి, పదవుల కోసమో, డబ్బుల కోసమో ఇంకో పార్టీలోకి పోవడమంటే అది రాజకీయ వ్యభిచారమే! తెలంగాణలో టీఆర్ఎస్, ఏపిలో టీడీపీ... రెండూ కూడా ఈరోజు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజకీయాలను కలుషితం చేస్తున్నాయి. ముఖ్యంగా వైకాపా ఎమ్మెల్యేలను పదవులతో, డబ్బుతో అడ్డగోలుగా కొంటున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు వెంకయ్య మాటలు కనువిప్పు కావాలి.

**– సాగర్.డి, నెల్లూరు.**




# మీ సేవలో దోపిడీ

మండల కేంద్రమైన విడవలూరులో ఒకే ఒక 'మీ సేవ' కేంద్రం ఉండడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి సర్టిఫికెట్‌కు కూడా అసలు దానికంటే అదనంగా వసూలు చేస్తున్నారు. అదనంగా డబ్బులు ఇవ్వకుంటే సర్టిఫికెట్లు రావడం లేదు. ఇక్కడ ఏ సర్టిఫికెట్‌కు ఎంత రుసుం చెల్లించాలి అన్న పట్టిక ఏర్పాటు చేయాలి. జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను పట్టించుకోవాలి.

**ఎన్.భాస్కర్‌రెడ్డి, విడవలూరు.**

# నీటిని కాపాడుకుందాం

కొన్ని రాష్ట్రాలలో వర్షాలు లేక నీటికి కటకట లాడుతున్నారు. భగవంతుని దయవలన మన రాష్ట్రంలో నీటికి కొరత లేదు. అయితే నీరుంది కదా అని వృథా చేయడం తగదు. నీళ్లు, విద్యుత్ ఆదాపై విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించాలి. హోటల్స్‌లో, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలలో నీటిని వృథా చేయొద్దంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

**సరిత, టీచర్, నెల్లూరు.**

# కావలికి వరం... బిఎంఆర్ కర్మాగారం

- జిల్లాపై మమకారాన్ని చాటుకున్న మస్తాన్‌రావు
- ఆడంబరంగా ప్రారంభమైన రెండు భారీ పరిశ్రమలు
- దేశ నలుమూలల నుండి తరలి వచ్చిన బీద మిత్ర బృందం





*గత 10 సంవత్సరాలుగా పారిశ్రామిక అభివృద్ధి అంతా జిల్లాకు దక్షిణం వైపే పరిమితమౌతున్న తరుణంలో నవ్యాంధ్ర రాజధాని అమరావతికి దక్షిణంగా కావలి సమీపంలో బిఎంఆర్ రొయ్యల మేత కర్మాగారాన్ని అతి భారీ వ్యయంతో ప్రారంభించాడు బీద మస్తాన్‌రావు.*

ఇప్పటికే శ్రీసిటి, కృష్ణపట్నం పోర్టు, చింతవరం, మేనకూరు సెజ్‌ల వంటి పారిశ్రామిక అభివృద్ధి అంతా తమిళనాడుకు దగ్గరగా జిల్లాకి దక్షిణాన వేగం పుంజుకుంటుంటే జిల్లాకు ఉత్తరం వైపు కూడా అభివృద్ధికి పునాది వేసి మార్గదర్శకం అయ్యాడు మస్తాన్‌రావు. రాజధాని కమిటి సభ్యుడిగా నవ్యాంధ్ర అభివృద్ధిలో తానూ ఓ సైనికుడిగా తన సొంత జిల్లా నుండే పారిశ్రామిక ప్రగతికి ఆయన శ్రీకారం చుట్టాడు. 150యకరాల విస్తీర్ణంలో, 60 కోట్ల రూపాయల ఖర్చుతో రొయ్యల మేత తయారీ కేంద్రాన్ని, దానికి అనుగుణంగా మరో 75కోట్లతో ప్రాసెసింగ్ ప్లాంట్‌ని ఇక్కడ మస్తాన్‌రావు నిర్మించాడు. ఇదే ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను, చెట్లని ఆర్గానిక్ పద్ధతితో పెంచుతూ ఆరోగ్యకరమైన వ్యవసాయానికి కూడా ఆయన శ్రీకారం చుట్టాడు. ఈ రెండు ప్లాంట్‌లను నడపడానికి సుమారు 150 కోట్ల రూపాయలు వర్కింగ్ క్యాపిటల్‌గా పెట్టాలి. ఇంతటి భారీ స్థాయి ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ మరియు మేత తయారీ కేంద్రం బహుశా నవ్యాంధ్రలో ఇదే ప్రథమం కావచ్చు. అంతర్జాతీయ ఆక్వా రంగాన్ని ఆకట్టుకునేలా నిర్మించిన ఈ కర్మాగారాలకు అవసరమైన యంత్రాలన్నీ చైనా, తైవాన్ దేశాల నుండి దిగుమతి చేసుకున్నారు.

అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నిర్మించిన ఈ పరిశ్రమలను ఈ నెల 18వ తేదీన ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాల్సినప్పటికి, అనివార్యకారణాల వల్ల ఆయన పర్యటన వాయిదా పడడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఆక్వా రంగంలో విప్లవాత్మక మార్పులకు కేరాఫ్ అడ్రస్ బిఎంఆర్ అని, ఈ ప్రాంతంలో ఆక్వా అభివృద్ధి కోసం ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని ఈ సందర్భంగా పత్తిపాటి పుల్లారావు తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలో ఆక్వా కళాశాలతో పాటు ఆక్వా విశ్వ విద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. డికెటి భూముల్లోనూ ఆక్వాసాగుకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పి.నారాయణ, శిద్దా రాఘవరావు, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసా రత్నం, మాజీఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, ఏపిఐఐసి ఛైర్మెన్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పరిశ్రమలను నెలకొల్పిన మస్తాన్‌రావు, దీని ప్రారంభోత్సవం కూడా అంతే ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. మంచి స్నేహసంబంధాలు కలిగిన ఆయన దేశనలుమూలలా వున్న తన మిత్రులందరినీ స్వయంగా ఆహ్వానించడంతో ఆయన ఆప్తమిత్రులంతా వివిధ రాష్ట్రాల నుండి వచ్చి అధిక సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు.

అతిథులను బీద మస్తాన్‌రావు, రవిచంద్రలు ఆత్మీయంగా స్వాగతించి అందరినీ సత్కరించారు. నెల్లూరుజిల్లాకి అంతర్జాతీయ ఆక్వా పరిశ్రమలను అందించిన బీద మస్తాన్‌రావుకి వారి బృందానికి 'లాయర్' అభినందనలు.

# పోర్టు పోయినట్లేనా?

- దుగరాజపట్నంపై నెగటివ్ రిపోర్ట్



**లేని ఆశలు కల్పించారు. రేకెత్తించిన ఆశలను నీరు గార్చారు. కేవలం నాయకుల వాగ్దానాలకు, పత్రికలలో వూహాగానాలకు, రియల్టర్ల భూముల కొనుగోలుకు మాత్రమే దుగరాజపట్నం పోర్టు అన్న ఓ ఫోబియాను పరిమితం చేశారు.**

వాకాడు మండలంలోని దుగరాజపట్నం వద్ద పోర్టు రానూ వచ్చింది, పోనూ పోయింది. అయితే ఇదంతా కాగితాల మీదే జరిగిపోయింది. దుగరాజపట్నం వద్ద పోర్టు సబ్జెక్ట్ ముగిసిపోయిన కథలాగే కనిపిస్తోంది. ఇక్కడ పోర్టు నిర్మాణం వల్ల పెద్దగా ఉపయోగమేమీ లేదని కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటి తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పోర్టు నిర్మాణానికి రోడ్డు, రైలు కనెక్టివిటీలు ఖర్చుతో కూడుకున్న పని. గూడూరు-దుగరాజపట్నం మధ్య రైల్వేలైన్ మంజూరైనా ఇంతవరకు ఒక్క అంగుళం పని కూడా జరగలేదు. ఇక పోర్టు నుండి జాతీయ రహదారికి అనుసంధానిస్తూ రోడ్డు విస్తరణ మరియు కొత్త రోడ్డు నిర్మాణం జరగాలి. ఇది కూడా వ్యయ ప్రయాసలతో కూడిన పని. ఈ రెండు పనులు కూడా ఆయా శాఖలు పూనుకుంటేనే పూర్తవుతాయి. ఇక సమీపంలో పులికాట్ సరస్సు, షార్ సెంటర్ ఉన్నందున పర్యావరణ అనుమతులు, భద్రతా పరమైన అనుమతులు కొంచెం క్లిష్టం కావచ్చు. అదీకాక పర్యావరణానికి హాని చేయని సరుకురవాణాకే ఇక్కడ ప్రాధాన్యత నివ్వాల్సి వుంటుంది. ఇక్కడ సమీపంలోనే కృష్ణపట్నం పోర్టు, ఎన్నూర్ పోర్టులు ఉన్నందున ఈ పోర్టుకు పెద్దగా వ్యాపారం ఉండకపోవచ్చునని పోర్టు సాధ్యాసాధ్యాలపై నియమించిన కమిటి తన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

దీంతో దుగరాజపట్నం పోర్టు కథ ఇక ముగిసిపోయినట్లేనని భావిస్తున్నారు. గత యూపిఏ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన పోర్టుకు మన రాష్ట్రంలో విశాఖ జిల్లా నక్కలపల్లి, ప్రకాశంజిల్లా రామాయపట్నం, నెల్లూరుజిల్లాలోని దుగరాజపట్నంలను పరిశీలించారు. అటూ ఇటు తిరిగి దుగరాజపట్నంను ఓకే చేశారు. రాష్ట్ర విభజన బిల్లులోనూ యూపిఏ ప్రభుత్వం ఏపి ప్రజల కన్నీళ్లను తుడవడానికన్నట్లు దుగరాజపట్నం పోర్టును చేర్చింది. ఎన్నికలకు ముందు తిరుపతి ఎంపీగా వున్న చింతా మోహన్ ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా హడావిడిగా శంకుస్థాపన చేయించాలని చూశారు. అయితే ఎన్నికలు రావడంతో అది సాధ్యం కాలేదు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ఈ పోర్టుపై అంత ఆసక్తి చూపించలేదు. అదీగాక జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా ఈ పోర్టు విషయంలో పెద్దగా పట్టుబట్టడం లేదు. ఈ పరిసరాలలో మన నాయకులకు భూములు లేకపోవడం కూడా దీనికి కారణం కావచ్చు. ఇక ముందు నుండి కూడా పులికాట్, షార్ వంటి అభ్యంతరాలున్నాయి. ఇప్పుడు కమిటీ రిపోర్ట్ వ్యతిరేకంగా ఉండడంతో పోర్టు దాదాపు ఎగిరిపోయినట్లే!

# పారదర్శకంగా బదిలీలు

- స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్



జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల బదిలీలను జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి సోమవారం స్వయంగా నిర్వహించారు. మధ్యాహ్నం మూడుగంటలకు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌డే హాల్‌లో ఈ ప్రక్రియ జరిగింది. రెవెన్యూలో ఒకే చోట మూడేళ్లు, ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరూ అక్కడకు చేరుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ బదిలీ కోరుకున్న ఉద్యోగుల జాబితాను పరిశీలించారు. కలెక్టర్ జానకి వచ్చి ఉద్యోగులు ఏఏ ప్రాంతాలకు వెళ్లాలనుకుంటున్నారనే ఆప్షన్లు పరిశీలించారు. రెవెన్యూ అసోసియేషన్ నాయకులను లోపలకు రానీయకుండా కేవలం బదిలీ కోరుకున్న ఉద్యోగులను మాత్రమే లోపలకు పిలిచి వారి ఆప్షన్‌లలో సాధ్యాసాధ్యాలను బట్టి పారదర్శకంగా బదిలీలు చేశారు. ఎవరూ వేలెత్తి చూపలేని విధంగా, పైరవీలు, సిఫార్సులకు తావులేకుండా కలెక్టర్ స్వయంగా ఈ బదిలీల తంతును పూర్తి చేయడం ఓ మంచి పరిణామం.

# జడ్పీలో తారుమారైన బలం



***నెల్లూరుజిల్లా పరిషత్‌లో బలాబలాలు తారుమారయ్యాయి. సభ్యుల సంఖ్యా పరంగా ఇప్పుడు తెలుగుదేశంది పైచేయి అయ్యింది. జడ్పీ పరంగా జరిగే తీర్మానాలలో ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి ఇవి కొత్త సమస్యలే! అయితే నాలుగేళ్ల వరకు ఆయనకు ఏమీ కాదు. రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోబోతున్న ఆయనకు ఇంకో రెండేళ్లు ఢోకా లేదు.***

2014లో జడ్పీ ఎన్నికలు జరుగగా వైకాపాకు 31సీట్లు, తెలుగుదేశంకు 15సీట్లు రావడం తెలిసిందే! అయితే అప్పుడు రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో, ఆ పార్టీ వాళ్లు అధికార బలంతో జడ్పీ ఛైర్మెన్ సీటును ఎగరేసుకుపోవాలనుకున్నారు. ఈ క్రమంలో వైకాపాకు చెందిన 8మంది జడ్పీటీసీలను తమ వైపుకు లాక్కున్నారు. ఈ నేపథ్యంలోనే జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడడం, ఎన్నికల సంఘం సీరియస్‌గా హెచ్చరించడంతో గట్టి బందోబస్తు మధ్య మూడోసారి ఎన్నికను నిర్వహించడం జరిగింది. జడ్పీటీసీలు చెరిసగం కావడంతో లాటరీ పద్ధతిలో ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్, కోఆప్షన్ సభ్యుల ఎన్నికల నిర్వహించారు. ఒక కోఆప్షన్ పదవి మాత్రమే తెలుగుదేశంకు దక్కగా, ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్, ఒక కోఆప్షన్ పదవులు వైసిపిని వరించాయి. జడ్పీలో ఇద్దరు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు, 23మంది జడ్పీటీసీలు, ఒక కోఆప్షన్ సభ్యుడు... 65మంది సభ్యులున్న జడ్పీలో 33మంది సభ్యులతో వైకాపా ఇప్పటిదాకా పైచేయి సాధిస్తూ వచ్చింది. అదీగాక వామపక్షాలకు చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా వీరికి సహకారం అందిస్తూ వచ్చారు. కాని ఇటీవలకాలంలోనే బలబలాలు అటుఇటుగా మారాయి. వైకాపాకు చెందిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌తో పాటు ఇటీవల వాకాడు, ఏఎస్‌పేట జడ్పీటీసీలు కూడా తెలుగుదేశంలోకి వెళ్లారు. దాంతో వైకాపా బలం పడిపోయి, తెదేపా సభ్యుల సంఖ్యలో పైచేయిలో వుంది. ఛైర్మెన్‌గా బొమ్మిరెడ్డి ప్రవేశపెట్టే తీర్మానాలను అడ్డుకోవడానికి గాని, తమ ఆధిపత్యం చెలాయించడానికి గాని అవసరమైన సంఖ్యాబలం తెలుగుదేశంకు వచ్చింది. ఇక జడ్పీలో పనులకంటే పరస్పర ఎత్తులు, పైఎత్తులకే సమయం సరిపోతుందేమో!

# నెల్లూరు కబుర్లు

### మూడోసారి వాయిదా పడ్డ
## ముఖ్యమంత్రి పర్యటన

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన ముచ్చటగా మూడోసారి కూడా వాయిదా పడింది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ఆయన పర్యటన ముందురోజు రాత్రి రద్దు చేశారు. 18వ తేదీ జిల్లాలో జలదంకి మండలంలో చిప్పలేరు చెక్‌డ్యాం, దామవరం వద్ద బిఎంఆర్ ఫీడ్ ఫ్యాక్టరీ, నెల్లూరురూరల్‌లోని కనుపర్తిపాడు వద్ద విపిఆర్ విద్య, వైద్యం కేంద్రాల ప్రారంభోత్సవాలలో ఆయన పాల్గొనాల్సి వుండింది. అదేరోజు ప్రముఖ సంఘసేవకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరడానికి ఏర్పాట్లు జరిగాయి. అయితే అనూహ్యంగా సీఎం పర్యటన వాయిదా పడడంతో చిప్పలేరు చెక్‌డ్యాంను, బిఎంఆర్ ఫీడ్ ఫ్యాక్టరీని మంత్రులే ప్రారంభించారు. ఇక విపిఆర్ విద్య, వైద్యం తమ సేవలు ప్రారంభించాయి. విపిఆర్ పార్టీ ప్రవేశం మాత్రమే ముఖ్యమంత్రి కోసం మిగిలింది.

- మాగుంట శరత్‌చంద్రారెడ్డి సహకారంతో

## ఉచిత జిమ్ పునఃప్రారంభం



నెల్లూరు మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత జిమ్‌ను పునఃప్రారంభించారు. గత 4సంవత్సరాలుగా అనివార్య కారణాల వల్ల మూసివేసిన నెల్లూరు, టెక్కేమిట్టలోని జై వీరాంజనేయ ఉచిత జిమ్‌ను 19వ తేదీ మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి పునఃప్రారంభించి మాట్లాడుతూ వ్యాయామం యువకులకు ఎంతో అవసరమని, ఎన్నో వ్యాధులను అరికట్టుకోవచ్చన్నారు. మానసిక సమస్యలను తొలగించడానికి ఈ వ్యాయామం సహాయపడుతుందన్నారు. ఈరోజుల్లో యువకులు ఏ జిమ్‌కు వెళ్లాలన్నా నెలకు వెయ్యిరూపాయలు పైగా చెల్లించి చేరాల్సిన పరిస్థితి వుందన్నారు. మాగుంట సేవాసమితి సభ్యులు ఈ ఉచిత జిమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని యువకులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, రితీష్‌కుమార్, రమేష్, కిషోర్, నరసింహ, జిమ్ నిర్వాహకులు గోపాల్, నాగేంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని నూతన కార్యవర్గం

లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని, నెల్లూరు నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. అధ్యక్షుడుగా పివిఆర్ ఏజన్సీస్ అధినేత సీతారామ్, కార్యదర్శిగా లీలాధర్‌రెడ్డి, కోశాధికారిగా సుధీర్‌బాబు, క్లబ్ అధ్యక్షుడిగా సూర్యనారాయణ ఎంపికయ్యారు. ముత్తుకూరు రోడ్డులో వున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు నూతన కార్యవర్గ అధ్యక్షులుగా పచ్చిపులుసు శ్రీరాములు, కార్యదర్శిగా చీతిరాల రంగనాథగుప్తా, కోశాధి కారిగా తాళ్ళూరు రామకృష్ణారావులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు అభినందించారు.



సీతారాంను సత్కరిస్తున్న మాజీఅధ్యక్షుడు కోటా రమేష్‌బాబు

## పోటాపోటీగా రేటు

- వెజ్ ఘాటు... నాన్‌వెజ్ హాటు





ఇంతకుముందు కూరగాయల ధరలు పెరిగితే కనీసం చికెన్, కోడిగుడ్ల ధరలు తక్కువగా వుండేవి. వీటి ధరలు పెరిగినప్పుడు కూరగాయల ధరలు తక్కువగా ఉండేవి. కాని ఇప్పుడు వెజ్... నాన్‌వెజ్... ఈ రెండింటి రేట్లు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. మార్కెట్లో కూరగాయల ధరలు చుక్కల్లో వున్నాయి. కిలో టమోటాలు 70రూపాయలు, పచ్చిమిరపకాయలు కిలో వంద. ఇక ఏ కూరగాయల ధరలు చూసినా కిలో 40రూపాయలకు పైమాటే! పోనీ కూరగాయలు కొనేటట్లు లేవు, నాన్‌వెజ్‌తో సరిపెట్టుకుందామా అంటే కిలో స్కిన్‌లెస్ చికెన్ 220రూపాయలు. ఇదే రికార్డ్ ధర. ఇది రంజాన్ మాసం. నాన్‌వెజ్ వాడకం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆ రేటు తగ్గే అవకాశం లేదు. మొత్తానికి వెజ్, నాన్‌వెజ్ రెండూ చుక్కలు చూపిస్తున్నాయి.

## డిఎస్‌డిఓ బదిలీ

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్‌ను ప్రకాశం జిల్లా డిఎస్‌డిఓగా బదిలీ చేశారు. చిత్తూరుజిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో ఖోఖో కోచ్‌గా పని చేస్తున్న బాలాజీని నెల్లూరు డిఎస్‌డిఓగా నియమించారు. అయితే నెల్లూరుజిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోచ్‌లుగా పని చేస్తున్న పాండురంగారావు, షేక్ షఫి, జగదీష్, రాజేంద్రరెడ్డిలను కూడా ఇక్కడ నుండి బదిలీ చేశారు.

### హెల్త్ చెకప్‌కు
## 'అపోలో' రాయితీ

నెల్లూరులోని హరనాధపురంలో వున్న అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రాయితీతో కూడిన హెల్త్ ప్యాకేజిని ప్రకటించినట్లు ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్ తెలిపారు. ఫాదర్స్ డేని పురస్కరించుకుని ఆదివారం నుంచి ఈ నెలాఖరువరకు ఈ హెల్త్ ప్యాకేజీ వుంటుందన్నారు. 2400 రూపాయల విలువైన అపోలో మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీని 12 వందలకు తగ్గించామని, అదే విధంగా, 3600 విలువలైన అపోలో హార్ట్ చెకిను 24 వందలకే చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు వైద్య పరీక్షలకు వచ్చేవారు ఉదయాన్నే ఏమీ ఆహారం తీసుకోకుండా వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## 'కిమ్స్'లో రక్తదానం

నెల్లూరు దర్గామిట్టలో వున్న కిమ్స్ (బొల్లినేని) ఆసుపత్రిలో ఈ నెల 18న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 122 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ, రక్తదానమంటే ప్రాణదానమని, రక్తదానాన్ని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఈ శిబిరాన్ని ప్రారంభించగా, ప్రముఖ వైద్యులు డాక్టర్ జగదీష్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, కుమార్, శ్రీహరి, నాగేంద్రబాబు, సిబ్బంది రక్తదానం చేశారు. ఆసుపత్రి మేనేజర్ పురుషోత్తం, సరిత, పిఆర్‌ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### రాహుల్‌గాంధీ
## జన్మదిన వేడుకలు

నెల్లూరు ఇందిరాభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఏఐసిసి ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, చెంచెలబాబుయాదవ్, భవానీ నాగేంద్ర ప్రసాద్, రఘురామ్ ముదిరాజ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కేశవనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సతీష్‌రెడ్డి తల్లిని
## పరామర్శించిన పారికర్



ఒకరు దేశ రక్షణ మంత్రి... ప్రధాని తర్వాత అత్యంత కీలక పదవిలో వున్న వ్యక్తి... మరొకరు ఆ మంత్రికి శాస్త్రీయ సలహాదారుడు. ఇద్దరూ నిజాయితీకి, దేశభక్తికి ప్రతిరూపాలే! ఒకరు మనోహర్ పారికర్ అయితే, రెండో వ్యక్తి మన నెల్లూరీయుడు, మహిమలూరు వాసి గండ్ర సతీష్‌రెడ్డి. ఈ నెల 16వ తేదీ నెల్లూరులో బీజేపీ సభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, అనారోగ్యంతో టెక్కేమిట్టలోని సతీష్‌రెడ్డి సోదరుడి ఇంట్లో వున్న ఆయన మాతృమూర్తి గండ్రా రంగమ్మను మనోహర్ పారికర్ పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చేయాలని డాక్టర్లకు సూచించారు.

## స్వర్ణా వేమయ్య వర్ధంతి



నిష్కళంక ప్రజానాయకుడు, మాజీఎమ్మెల్యే స్వర్ణా వేమయ్య 21వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీన నెల్లూరురూరల్ పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి సమాజమందిరంలో నిర్వహించారు. వేమయ్య కుమారుడు స్వర్ణా గంగాధర్ ఈ సందర్భంగా 10మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్వర్ణ వేమయ్య ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ తరపున 20వేల రూపాయల నగదు బహుమతులు అందజేశారు. అలాగే దివ్యాంగులకు, వృద్ధులకు దుప్పట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి జి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘసంస్కర్త తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, గుమ్మడి రాజాగోపాల్‌రెడ్డి, స్వర్ణ వేమయ్య కుటుంబసభ్యులు హైమావతి, విజయలక్ష్మి, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

## నిరాధార బాలబాలికలను ఆదుకోవాలి



నిరాధార బాలబాలికలను ఆదుకోవడం అందరి కర్తవ్యమని భగవాన్ మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జె.పి.జైన్ అన్నారు. ఆదివారం జనహిత వాత్సల్యలో జరిగిన కార్యక్రమంలో 130మంది బాల బాలికలకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జైన్ మాట్లాడుతూ వాత్సల్య గత 27 సంవత్సరాలుగా వృద్ధులను, నిరాధార బాలబాలికలను ఆదరిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, ఆటలపోటీలు, యోగ, సాహితీ, సాంస్కృతిక రంగాలలో రాణించాలన్నారు. తమ సంస్థ వివిధ రకాల సేవల్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత గౌరవ వాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ టివిఎస్ దుర్గాప్రసాద్, మోహన్‌లాల్‌జైన్, ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, స్కూలు ప్రధానోపాధ్యాయుడు యం.మధుసూదన్‌రెడ్డి, వాత్సల్య సభ్యులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తాత్కాలిక వెలుగులు



ప్రతి ఇంట విద్యుత్‌ను ఆదా చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ఎల్‌ఇడి కాంతులు తాత్కాలికమే అవుతున్నాయి. మామూలు బల్బులు కంటే ఎల్‌ఇడి బల్బులతో విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. అయితే బయట షాపులో ఎల్‌ఇడి బల్బుల రేటు ఎక్కువ. ఇంత ఖరీదైన బల్బులను పేద, మధ్య తరగతి ప్రజలు కొనుక్కోరని చెప్పి విద్యుత్ సంస్థ ప్రతి ఇంటికి రెండు బల్బులు లెక్కన ఒక్కో బల్బును పదిరూపాయలకు అందజేసింది. జిల్లాలో 8లక్షల 40వేల గృహాలుండగా దాదాపు 50శాతం వినియోగదారులు ఈ బల్బులను కొన్నారు. కొనేటప్పుడు మూడేళ్ల పాటు వారంటీ కూడా ఇచ్చారు. బల్బు కాలిపోతే ఉచితంగా ఇంకోటి ఇస్తామన్నారు. అయితే పెట్టిన నెలకే చాలా ఇళ్లల్లో బల్బులు కాలిపోసాగాయి. ఇలా పెద్దసంఖ్యలో బల్బులు కాలిపోయాయి. కాని ఈ బల్బులు పంపిణీ చేసిన సంస్థ మాత్రం పత్తా లేకపోవడంతో వినియోగదారులు మళ్లీ మామూలు బల్బులనే కొంటున్నారు. దీనివల్ల ఎల్‌ఇడి బల్బులతో విద్యుత్‌ను ఆదా చేయాలన్న ఆశయం అటకెక్కింది.

# ఆయుధాల కర్మాగారం పెట్టండి

**- రక్షణ మంత్రికి ఎంపి వినతి**

నెల్లూరుజిల్లాలో రక్షణ పరికరాల తయారీ కర్మాగారం నెలకొల్పాలని కేంద్ర రక్షణ మంత్రి మనోహర్ పారికర్‌ను నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరాడు. ఈ నెల 16న నెల్లూరొచ్చిన పారికర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరుజిల్లాలో అనువైన భూములున్నాయి. జాతీయ రహదారి, రైల్వేలైన్, పోర్టు వంటి వసతులున్నాయి. అన్ని విధాలా ఆయుధాల ఫ్యాక్టరీ పెట్టడానికి ఇది అనువైన స్థలమని ఎంపీ చెప్పగా, రక్షణ మంత్రి కూడా సానుకూలంగానే స్పందించారు. నెల్లూరు సురక్షిత జోన్‌లో వుంది. రక్షణ పరికరాల తయారీలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కలుపుకునే అంశం పరిశీలనలో వుంది. దీని మీద క్లారిటీ రాగానే నెల్లూరులో ఆయుధాల ఫ్యాక్టరీపై కూడా ఆలోచిస్తామని పారికర్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# బడి పిలుస్తోంది... పోస్టర్ ఆవిష్కరణ



'బడి పిలుస్తోంది' కార్యక్రమంపై తెలుగునాడు విద్యార్థి సంఘం రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఈ నెల 20వ తేదీన నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆవిష్కరించారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు యస్‌దాని, సాయికిషోర్, ప్రేమ్‌కుమార్, షారూక్, హరికృష్ణ, చైతన్య, మురళీ, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా... హుషారుగా... ఏరువాక



పూజలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ యం.జానకి



దుక్కిదున్నుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఈ నెల 20వ తేదీన కావలి మండలం అన్నెమడుగు గ్రామంలో ఏరువాక పున్నమి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ యం.జానకి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు ప్రారంభించారు. కలెక్టర్ టెంకాయ కొట్టి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇక ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అయితే తలకు పాగా చుట్టి రైతుగా మారిపోయాడు. నాగలిపట్టి, కాడెద్దులను ముందుకు అదిలిస్తూ దుక్కిదున్ని రైతన్న శ్రమలో వున్న ఆనందాన్ని చవిచూసాడు. ఈ సందర్భంగా కలెక్టర్ జానకి మాట్లాడుతూ ఏరువాకను పండుగలా జరుపుకోవడం మన సంస్కృతిలో ఒక భాగమన్నారు. నెల్లూరుజిల్లాలో నాలుగేళ్లు వరుసగా వర్షాలు లేవని, గత ఏడాది మాత్రం మంచి వానలు పడ్డాయని, దీంతో సాగునీళ్లకు, తాగునీళ్లకు ఇబ్బంది లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది 10లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇది జిల్లా చరిత్రలో ఆల్‌టైం రికార్డన్నారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు ఆసరాగా నిలబడుతుందని, మట్టి నమూనా సేకరణ నుండి ధాన్యం కొనుగోలు వరకు రైతుకు ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# నాయకుడిని కాదు... మీ సేవకుడిని



పార్కును ప్రారంభిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజలకు నాయకుడిగా వుండడం కంటే, వారికి సేవకుడిగా వుండడమే తనకు ఎంతో ఇష్టమని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన నెల్లూరు, 29వ డివిజన్‌లోని నిప్పో హౌసింగ్‌బోర్డ్ కాలనీలో తన స్నేహితుల సహకారంతో 5లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కును ఆయన స్థానికులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చానని, సామాన్యుడిగా ఉండడమే తనకు ఇష్టమని, రూరల్ ప్రజలు తనను కుటుంబసభ్యుడిలా భావించి ఎమ్మెల్యే బాధ్యతలు అప్పగించారని, వాటిని చిత్తశుద్ధితో నిర్వర్తించడమే తన కర్తవ్యమన్నారు. తనకు రాజకీయ వారసత్వం లేకున్నా, కోటీశ్వరుల కుటుంబం కాకున్నా తనకు చేతనైనంత వరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. తన నియోజకవర్గంలో ఇప్పటివరకు 5పార్కులు అభివృద్ధి చేసి ప్రజలకు అందించానని తెలిపారు. స్థానిక రాజకీయాలకు అతీతంగా ప్రజలే పార్కుల నిర్వహణను చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నగరాధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, వైసిపి జిల్లా అధికారప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి నాయకులు సిహెచ్ సాయిసునీల్, తులసీ ఆదిత్య, సుబ్బరామిరెడ్డి, రవితేజ, మధు, రఘు, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రావు, హుస్సేన్, ప్రసాద్, విశ్వనాథరావ్ తదితరులు పాల్గొన్నారు.

# వందల కోట్లు తగలేసినా.... ఉపయోగం అంతంతే!

- హడ్కో నిధులపై దుమారం
- ఏడాదికి వందకోట్ల వడ్డీ
- ప్రజలపై మోయలేని భారం
- కాలువల పూడిక తీస్తే అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పనే లేదు
- రోడ్లు ధ్వంసం, ప్రజలకు ఇబ్బంది తప్ప ఇంకోటి లేదు



***మన దగ్గర లక్ష రూపాయలుంటే ఓ రేకుల ఇల్లు కట్టుకుని అందులో ఉంటాం. అంతేగాని లక్ష ఉన్నాయని చెప్పి ఇంకో పాతిక లక్షలు అప్పుచేసి డూప్లెక్స్ ఇళ్లు కట్టుకోలేం కదా! కాని మన నెల్లూరు నగర పాలక సంస్థ వాళ్ళు ఇప్పుడు ఇదే పని చేస్తున్నారు. 'అప్పు చేసి పప్పుకూడు' సామెతను ఆచరణలో పెడుతున్నారు. 'హడ్కో' సంస్థ నుండి 1100కోట్ల రూపాయల అప్పు తెచ్చి నగర ప్రజలపై రుద్దబోతున్నారు. సాలీనా ఒక్కో ఇంటిపై 5లక్షల రూపాయల ఋణ భారం మోపబోతున్నారు.***

నెల్లూరు నగరంలో భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌లకు 1100 కోట్లు హడ్కో నిధులు మంజూరు కావడం, ఎల్ అండ్ టి, మెగా ఇంజనీరింగ్ కంపెనీలు ఈ పనులను దక్కించుకోవడం జరిగింది. హడ్కో వద్ద తీసుకున్న 1100కోట్ల ఋణానికి గాను ఏడాదికి వందకోట్లు చెల్లించాలి. మన నగరపాలక సంస్థ వార్షికాదాయమే 50కోట్లకు మించడం లేదు. జీతాలు, కరెంట్ బిల్లులు కూడా సక్రమంగా చెల్లించలేని పరిస్థితి. అదీగాక జపాన్‌కు చెందిన 'జైకా' 3పైసల వడ్డీతో ఋణమిస్తామంది. నగరపాలక సంస్థ దానిని వదిలేసి 10.5శాతం వడ్డీని వసూలు చేసే హడ్కో ఋణం వైపు ఎందుకు మొగ్గు చూపిందన్నది పెద్ద ప్రశ్న!

అసలు అప్పులు తెచ్చుకుని వడ్డీలు కడుతూ పనులు చేసుకునేంత ఆర్థిక స్థోమత మన కార్పొరేషన్‌కు ఉందా? మంచినీటి పైప్‌లైన్ పనులకు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే మంజూరు చేయవచ్చు. లేదా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా యం.వెంకయ్య నాయుడు సహకారం కోరి వుండవచ్చు. నెల్లూరేమీ పాకిస్థాన్‌లో లేదు. భారత్‌లోనే వుంది. ఈ నగరంలో ప్రజలకు మంచినీళ్లు అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద కూడా ఉంటుంది.

ఇక నగరంలో డ్రైనేజీ అన్నది అస్తవ్యస్థమే! ఇది సంవత్సరం పొడవునా ఉండే సమస్య కాదు. వానా కాలంలో ఇబ్బంది పెట్టే సమస్య. ఈరోజు భూగర్భ డ్రైనేజీ అంటే నగరంలో వందల కిలోమీటర్ల రోడ్లను ధ్వంసం చేయాలి. వీటిని వేయడానికే వందల కోట్లు ఖర్చై వుంటాయి. ధ్వంసం చేసిన రోడ్లను మళ్ళీ వేయాలి. మళ్ళీ అదొక ఖర్చు. అదీగాక ఈ పనులు పూర్తి కావడానికి ఏడాది పట్టొచ్చు. లేదా రెండేళ్లు పట్టొచ్చు. అప్పటి దాకా ప్రజలకు అవస్థలు.

నగరంలో డ్రైనేజీ లేక సమస్య కాదు. ఉన్న డ్రైనేజీ వసతులను సరిగా నిర్వహణ చేసుకోలేకే సమస్యలు. మనకున్నన్ని పంట కాలువలు ఏ నగరంలోనూ వుండవు. ఇవన్నీ ఇప్పుడు డ్రైనేజీ కాలువలే! ప్రతి వీధిలోని డ్రైనేజీ కాలువను ఈ ప్రధాన కాలువలతో అనుసంధానం చేయొచ్చు. డ్రైనేజీ ప్రవాహానికి ఈ కాలువలే పెద్ద ఆధారం. అయితే ప్రతి ఏటా ఈ పంట కాలువల పూడికలు తీయడం, ఆక్రమణలు తొలగించి రివిట్‌మెంట్‌లు నిర్మిస్తే వందల కోట్లు ఖర్చయ్యే భూగర్భ డ్రైనేజీతో అసలు అవసరమే ఉండదు.

గత ఏడాది నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు నగరంలో పలు ప్రాంతాలు జలమయం కావడం తెలిసిందే! ఇలా జరగడానికి ప్రధాన కారణం పంట కాలువల ఆక్రమణలు, పూడికలు తీయకపోవడమే! ఆరోజు ముఖ్యమంత్రి మూడురోజులు నెల్లూరులో తిరిగాడు. జిల్లా మంత్రి పి.నారాయణ, ఇన్‌ఛార్జ్ మంత్రి సిద్ధా రాఘవరావులు నెల్లూరులోనే మకాం పెట్టారు. పంట కాలువల ఆక్రమణలపై సర్వేలు చేయించారు. 200 జేసీబీలు పెట్టి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. పూడికలు తీయిస్తామన్నారు. ఈ పనులు చేయడానికి వందల కోట్లు అవసరం లేదు. ఇవి చేస్తే నగరంలో డ్రైనేజీ సమస్య తీరుతుంది. చేయాల్సిన పనులను వదిలేసి వందల కోట్ల అప్పులు తెచ్చుకుని ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం ఇప్పుడున్న ఇబ్బందుల్లో ఉందా?

# 'గిరి'పుత్రుల్లో చైతన్యం కోసం...


శివరాత్రి పూజల్లో పాల్గొన్న గిరిజనులు

**వాళ్లకు కల్లాకపటం తెలియదు. కుట్రలు, కుతంత్రాలకు చాలా దూరం. కోట్లు కూడబెట్టాలనే ఆశలు, ఆలోచనలు వారికుండవు. ఏరోజు కారోజు కష్టపడడం, వచ్చినదాంతో ఆరోజుకు తినడం మాత్రమే వారికి తెలుసు. దొరికిన దాంతో సంతృప్తి చెందడం అన్నది మనం వారిని చూసే తెలుసు కోవాలి. ఆ అమాయక జీవులే గిరిజన తెగకు చెందిన యానాదులు.**

వీరిలో చైతన్యం తేవటం కోసం, వీరిని విద్యా, ఉపాధి రంగాలలో అభివృద్ధి చేయడం కోసం పలు సంస్థలు, పలువురు వ్యక్తులు తమవంతు కృషి చేస్తూనే వున్నారు. ఈ పరంపరలో నెల్లూరుజిల్లా వింజమూరు మండలం వూటుకూరు గ్రామ పంచాయితీలోని ఇందిరానగర్‌లో వెలిసిందే శ్రీ శివశంకరి గిరిజన ఆశ్రమం. ఈ కాలనీ గిరిజనులలో చైతన్యం కోసం ఆ గ్రామ సర్పంచ్ కృష్ణయ్యతో పాటు పరుచూరు వెంకటేష్, వెంకటరెడ్డి అనే స్వచ్ఛంధ సేవకులు ఈ ఆశ్రమ నిర్మాణానికి పూనుకున్నారు. గత ఏడాది దసరా పండుగ రోజున 5.16ఎకరాల స్థలంలో ఈ ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఈ గ్రామంలో గిరిజనులను మద్యం ముట్టకుండా చేశారు. ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నారు. గిరిజనులను ఆధ్యాత్మికంగానూ చైతన్యం చేస్తున్నారు. వారిని భక్తి కార్యక్రమాలలో పాల్గొనేలా చేస్తున్నారు. 70మంది విద్యార్థులకు ధ్యానం, యోగ వంటివాటిలో శిక్షణనిచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా వివిధ ప్రలోభాలకు గురై స్వధర్మాన్ని వీడి అన్యసంస్కృతి వైపు పోకుండా, గిరిజనులను మన సంస్కృతిలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమాల ముఖ్యలక్ష్యమని నిర్వాహకులు పేర్కొంటున్నారు. రాబోయే నవరాత్రులలో ఆశ్రమం వద్ద చండీహోమం, సామూహిక భోజనాలు, వస్త్రదానం నిర్వహిస్తున్నామని, 20వేల మంది దాకా గిరిజనులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

గిరిజనులలో మార్పు తెచ్చేందుకు, వారిని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఇదో మంచి ప్రయత్నం. ప్రతి గ్రామంలోనూ ఇలాంటి సంస్థలు, వ్యక్తులు ముందుకు వచ్చి గిరిజనులకు చేయూతనందించి ముందుకు నడిపించాల్సిన అవసరముంది.

# నేత్రపర్వంగా గరుడసేవ

గూడూరు పట్టణం రాజావీధిలో వెలసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి మోహినీ అలంకారం చేశారు. రాత్రి శ్రీవారి గరుడసేవను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామిని దర్శించుకొన్నారు. అర్చక స్వాములు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఎస్సీ విద్యార్థులకు బ్యాగులు

2016-17 విద్యా సంవత్సరానికి గూడూరు మండలంలో ఎస్‌సి విద్యార్థులున్న ప్రతి పాఠశాలలో విద్యార్థులకు 400 బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు మరియు విద్యాసామాగ్రిని పంపిణీ చేయడం జరిగింది. కుమారి కామిశెట్టి లక్ష్మీ నేహ, ఆమె తండ్రి కామిశెట్టి ఆనంద్ కుమార్‌ల ద్వారా దాత బాల్య స్నేహితులు సొల్లేటి వెంకట సుబ్బయ్య, సోమిశెట్టి ఉమాశంకర్, వివిఎస్ ప్రసాద్, కందగడ్డల సురేంద్రకుమార్, మహమద్ రవూఫ్ ఈ కార్యక్రమం చక్కగా నిర్వహించారు. అదేవిధంగా విద్యావనరుల కేంద్రం (ఎంఆర్‌సి), గూడూరుకు 2సీలింగ్ ఫ్యాన్‌లు ఎంఇఓ అందచేయడం జరిగింది. ఎక్కువ మంది పిల్లలున్న 2 పాఠశాలలకు క్రీడా సామాగ్రి కిట్ అందజేశారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం పేదపిల్లల చదువు కోసం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనిమెళ్ళ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# తారక రత్నకు సన్మానం


తారకరత్నను సన్మానిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

కోట తెలుగుదేశంపార్టీ నాయకుడు తూపిలి రాధాకృష్ణారెడ్డి ఇంటి వద్ద సోమవారం సాయంత్రం ఆ పార్టీ నాయకులు, సినీ నటుడు నందమూరి తారకరత్నను ఘనంగా సన్మానించారు. కోటలోని తారకరత్న అత్తగారి ఇంటికి వచ్చిన సందర్భంగా అభిమానులు కోలాహలంతో బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఆయనతో ఫోటోలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. తారక రత్న చేతులు తిప్పుతూ అభివాదం చేస్తూ అభిమానులను ఆనందపరిచారు. అనంతరం మూడు మండలాల నాయకులు తెలుగుదేశంపార్టీ నాయకులు తూపిలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యాన నిలువెత్తు పూలమాలతో ఘనంగా సన్మానించారు. వాకాడు సిఐ అక్కేశ్వరరావు, ఎస్సై అజయ్‌కుమార్ సిబ్బందితో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, రాష్ట్ర తెదేపా బీసీ సెల్ కార్యదర్శి సుధీర్, మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు తూపిలి రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రక్తదాతలకు ఆంధ్ర మహిళా మండలి సన్మానం


మాట్లాడుతున్న డాక్టర్ సి.రోహిణి తదితరులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ కోరారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆంధ్ర మహిళామండలి ఆధ్వర్యంలో రక్తదాతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో రక్తస్రావమై ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తాన్ని దానం చేసి వారి ప్రాణాలు కాపాడగలిగితే ఉన్నంత సంతృప్తి ఏం చేసినా కలగదన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ సిఆర్ రెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని దానం చేసేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. మొదట్లో రక్తదానం చేయాలంటే ఎంతో భయపడే వారని, తొలుత గూడూరులో 1968లో రక్తదానం చేసేందుకు అల్లూరు ఆది శేషారెడ్డి ముందు కొచ్చారన్నారు. గూడూరులో రక్తం సకాలంలో అందక ఎవరూ మృత్యువాత పడకూడదన్నదే తన కోరికన్నారు. డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 16ఏళ్ల వయస్సు నుంచి 60ఏళ్ల వయస్సువారెవరైనా తమ రక్తాన్ని దానం చేయవచ్చన్నారు. డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ గూడూరులో రక్తదాతలకు కొదువలేదని, ఎవరికి ఫోన్ చేసినా వచ్చి రక్తాన్ని ఇస్తూ ఎందరికో ప్రాణదానం చేస్తున్నారన్నారు. 58 సార్లు రక్తదానం చేసిన చెంచురామయ్య, 20సంవత్సరాలుగా రక్తదానం చేసిన డాక్టర్ సుగుణమ్మ, కొండా కాశీ(20సార్లు), భాస్కర్‌రెడ్డి (54సార్లు), రమేష్‌రెడ్డి (38సార్లు), జోగిపర్తి వెంకటేశ్వర్లు(60సార్లు), అన్వర్ (20సార్లు)లను పలువురు కొనియాడారు. వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బారావు, ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షులు మాగుంట సుదర్శనమ్మ, రోటరీ గవర్నర్ కె.మునిగిరీష్, రోటరీ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి, సెక్రటరి మునిరాజా, కె.సుందరరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవలను విస్తరిస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్

## - రీజనల్ మేనేజర్ బి.వి శివయ్య



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ తన సేవలను మరింతగా విస్తరిస్తోందని, జిల్లాలో త్వరలో మరో 30 నూతన శాఖలను ప్రారంభించేందుకు సమాయత్త మవుతోందని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ బి.వి శివయ్య వెల్లడించారు. ఈ నెల 18న నెల్లూరులోని రీజనల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న ఆర్థికసంవత్సరంలో బ్యాంకింగ్ సేవలను మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ 2015-16 ఆర్థిక సంవత్సరంలో నెల్లూరు రీజనల్ పరిధిలో 166.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని, 1637 కోట్ల నెట్ వర్త్ కలిగి దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంక్ లలో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద 5,71,394 సేవింగ్స్ ఖాతాలు ప్రారంభించి రూ.75 కోట్ల డిపాజిట్లను ఆ ఖాతాల ద్వారా సేకరించామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఆ బ్యాంక్ సీనియర్ మేనేజర్లు డాక్టర్ ఎంఎస్ రామ్. వి.మధుసూదన్, కె.హనుమంతరావు, ఎస్.భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ పుస్తకాల పంపిణీ


పలకలు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న క్లబ్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సిఐ సుబ్బారావు, ఎస్ఐ దశరథరామారావు తదితరులు

సమాజంలో విద్యకు వున్న విలువ, గౌరవం దేనికీ లేదని గూడూరు పట్టణ సిఐ సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని ఎస్ఎంజి ప్రాథమిక, పూలతోట, రాణీపేట, మాయాబజారు పాఠశాలల్లో ఇటీవల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కీర్తిశేషులు పేటేటి ఆదిశేషయ్య శాంతమ్మ గార్ల జ్ఞాపకార్థం క్లబ్ ప్రతినిధి పేటేటి గిరి సహకారంతో విద్యార్థులకు 500నోటు పుస్తకాలను, పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, మల్లు విజయకుమార్‌రెడ్డి, షేక్ రియాజ్ అహ్మద్, పేటేటి ప్రకాశరావు, సురేష్, ఎస్.ఐ దశరథరామారావు, ప్రధానోపాధ్యాయుని పి.సులేఖ, ఉపాధ్యాయులు ఐ.ఆదిలక్ష్మి, రాజగోపాల్, జి.యశోదమ్మ, లయన్స్‌క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

# ప్రజావిజ్ఞప్తుల దినం


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా అర్జీదారులు అధికారులకు అర్జీలను సమర్పించి తమ సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. గూడూరు డివిజన్‌లో పలు మండలాల ప్రజలు కలిసారు. విద్యా హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అధికంగా భూవివాద సమస్యలు మండల కార్యాలయాల్లో అధికారులు పరిష్కరించకపోవడంతో తిప్పలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌కలెక్టర్ వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తానన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

తొందరపాటు నిర్ణయాలు, ప్రవర్తన తగ్గించుకొనండి. అనుకొన్న పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉంటుంది. ఆదాయం సంతృప్తికరం. అయినా అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు, శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. సోదర వర్గానికి మేలు జరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలు సంతృప్తిని ఇవ్వగలవు. కొత్త పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు అవకాశాలుంటాయి. ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో సమర్ధతను చూపుతారు. బిడ్డల ఉన్నత విద్యపై శ్రద్ధ చూపుతారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరుకుతాయి. తగాదాలు, విభేదాలు సర్దుబాటు కాగలవు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగులకు ప్రమోషన్లు ఉంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చేసే పనులకు ఆటంకాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, సహకారం ఆలస్యం కాగలదు. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో అనుకూలించవు. ఖర్చులు పెరిగి ఋణాలు చేయవలసి వస్తుంది. ఆర్ధిక లావాదేవీలందు జాగ్రత్త అవసరం. వస్తువాహన గృహ రిపేర్లుంటాయి. ఆరోగ్యం విషయంలోను, ముఖ్యపత్రాలు, విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త అవసరం.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అదనపు ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ఒక మోస్తరుగా జరిగి ఆదాయం కూడా అట్లే ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. కొత్త ఆలోచనలతో ప్రయత్నాలతో ఆర్థిక ప్రణాళికలు ఏర్పరుచుకుంటారు. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించే అవకాశమున్నది. విద్యార్థులు కొత్త కోర్సులందు ఇముడుతారు.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 24.6.2016 నుండి
తేది. 30.6.2016 వరకు

ఈ వారం వృషభంలో బుధుడు, 27 తేది నుండి మిధునంలో బుధుడు, మిధునంలో రవి శుక్రులు, సింహంలో గురురాహువులు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

శుక్ర మౌఢ్యమి జరుగుచున్నది. ముహూర్తములు లేవు.

### జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | శుక్ర | చతుర్థి | సా॥ గం.3.43వ॥ |
| తేది. 25 | శని | పంచమి | ప॥ గం.2.27వ॥ |
| తేది. 26 | ఆది | షష్ఠి | ప॥ గం.12.49వ॥ |
| తేది. 27 | సోమ | సప్తమి | ఉ॥ గం.10.52వ॥ |
| తేది. 28 | మంగళ | అష్టమి | ఉ॥ గం.8.40వ॥ |
| తేది. 29 | బుధ | నవమి | ఉ॥ గం.6.20వ॥ |
| | పిదప | దశమి | రా॥ గం.3.50వ॥ |
| తేది. 30 | గురు | ఏకాదశి | రా॥ గం.1.17వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో భిన్నాభిప్రాయాలు రాకుండా చూచుకొనాలి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యం. ఖర్చులు పెరిగిపోతాయి. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా జరుపుకొనాల్సి ఉంటుంది. మీపై బంధువర్గానికి అపోహలుంటాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు కలసి వస్తాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. పని భారం ఉండినా ఉద్యోగులు సమర్ధతను ప్రదర్శిస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఖర్చులు అదనంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం ఉంటుంది. ఇంట బయట వ్యవహారాలను సమర్ధవంతంగా జరుపుతారు. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. సోదరులకు అభివృద్ధి మేలు జరుగుతుంది. బంధువులతోను, సన్నిహితులతోను ఉన్న విభేదాలు సర్దుబాటు కాగలవు. వ్యవహారాలను సొంతంగా జరపండి. మధ్య దళారులు వద్దు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

చేపట్టిన పనులకు ఆటంకాలు కలిగి ఇబ్బంది పెడతాయి. వ్యాపారాభివృద్ధి అవకాశాలు తగ్గుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ఇతరుల పనులకు సహాయము చేస్తారు. కుటుంబంలో చిన్నచిన్న సమస్యలుండి కలతపెట్టగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త పడాలి. చెల్లింపులు సకాలంలో చేస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థికంగా మందకొడి పరిస్థితులుంటాయి. ఆదాయం, వ్యాపారావకాశాలు తగ్గుతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలు కొంత దక్కుతాయి. వృత్తి పరంగా సంతృప్తి ఉంటుంది. శుభ కార్య ప్రయత్నాలు అనుకూలించవు. కుటుంబంలో చిన్న చిన్న ఇబ్బందులుంటాయి. సర్దుకొనిపోవాలి. చెల్లింపులు ఖర్చులు అధికంగా ఉంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి. వ్యాపారవృత్తి రంగాల జీవనం కలవారికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు నిర్ణయం కాగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. పెట్టుబడుల అవకాశాలుండి షేర్ల మీద లాభాలుంటాయి. చేపట్టిన పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్‌గా ఉంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు అప్రయత్నంగానే సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల ఆదాయం బాగుంటుంది. బంధువుల ప్రవర్తన ఇబ్బంది కలిగించవచ్చును. ఉద్యోగులకు స్థానమార్పులు, పదోన్నతులుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, స్థిరాస్తులపై ఆదాయం ఉంటుంది. అప్పుడప్పుడు టెన్షన్ ఉంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆదాయానికి తగినట్లుగా ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం బాగుంటుంది. మాట వేగం తొందరపాటు తగ్గించుకొనడం మంచిది. బంధువులతో స్వల్ప విభేదాలుండవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుండి బిడ్డల విద్యా, శుభకార్యాల విషయంలో శ్రద్ధ చూపెడతారు. పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. నలుగుతున్న సమస్యలనుండి బయటపడతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండండి. బిడ్డల విద్యా, శుభకార్యాలపై దృష్టి పెట్టి కృషి చేస్తారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత బాగుంటుంది. వాహనాలు నడిపేవారు, కరెంటు, యంత్రాల పనులందు జాగ్రత్త అవసరం. కొత్త ప్రాంతాలను సందర్శిస్తారు. ఆరోగ్యం ఫరవాలేదు.

# హీరోయిన్‌ల పేరుతో రైతులకు టోపీ!

శ్రీను గల్పిక

అది ఢిల్లీలోని రాంలీలా మైదానం. అంతర్జాతీయ యోగా దినోత్సవం(21వ తేదీ) సందర్భంగా ముందురోజు అక్కడ నాయకులందరితో ప్రధాని నరేంద్రమోడీ యోగా రిహార్సల్ చేయిస్తున్నారు. కేంద్ర మంత్రులు మనోహర్ పారికర్, రాజ్‌నాథ్ సింగ్, అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు, సురేష్ ప్రభులతో పాటు ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపి మంత్రులు నారాయణ, దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(65) తదితరులున్నారు. మీరు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా వుంటుంది. దేశం ఆరోగ్యంగా వుంటేనే ప్రజలు ఆరోగ్యంగా వుంటారు. కాబట్టే ముందు మీరు యోగా చేస్తే ప్రజలు కూడా యోగాను వంటబట్టించుకుంటారన్న ఉద్దేశ్యంతో ముందుగా మీకు యోగా క్లాసు తీసుకుంటున్నానని నరేంద్రమోడీ చెప్పి పలు ఆసనాలు మొదలు పెట్టించాడు. తల పైకెత్తడం, మెడలు వంచడం, ఒంటి కాలిమీద నిలబడడం... ఈ ఆసనాలన్నింటిని చూసి కేసీఆర్... సార్, దీనికింత సీనెందుకు... మా తెలంగాణలో క్వార్టర్ బిగించారంటే ఎట్లాండోడైనా ఈ ఆసనాలు ఈజీగా వేస్తుంటాడన్నాడు. అందుకు మోడీ... క్వార్టర్, హాఫ్‌లతో పని లేకుండా ఉండడం కోసమే ఈ ఆసనాలని చెప్పాడు. తర్వాత ధ్యానం మొదలు పెట్టించాడు. అందరూ కాళ్లు, కళ్లు ముడుచుకుని "ఓం... ఓం" అని ధ్యానం చేయసాగారు. ఓంకార శబ్దాన్ని మోడీ శ్రావ్యంగా వింటుండగా మధ్యలో అతని చెవికి అపశృతులు తాకసాగాయి. ఆ శృతులు ఏమైందీ అర్ధం కాలేదు. ఆ స్వరం ఎక్కడ నుండి వస్తుందా... అని పరికించి చూసాడు. చంద్రబాబు పక్కన కళ్లకు నల్లద్దాలు పెట్టి కూర్చుని ధ్యానం చేస్తున్న వివేకా నోటి నుండీ ఆ స్వరాలు వస్తున్నట్లు గుర్తించాడు. ఆ వైరైటీ మంత్రాలేంటో విందామని మోడీ సైలంట్‌గా వివేకా వద్దకెళ్లి కూర్చున్నాడు. ఇప్పుడు ఆయన నోటి నుండి వస్తున్న మంత్రాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఓ అనుష్క... ఓహో కాజల్... రారా రంభ... ఓంహ్రీం ప్రియమణి, రావే హంసానందిని... అందరూ సినిమా యాక్టర్ల పేర్లే.. అవి విని మోడీకి చిర్రెత్తుకొచ్చి, వెంకయ్య నాయుడును పిలిచి... ఇతనేంటి ఓంకారం బదులు సినిమా యాక్టర్ల పేర్లు జపిస్తున్నాడని అడిగాడు. దానికి వెంకయ్య... అతను అంతే, నిద్రలో ఇష్టమైన హీరోయిన్‌ల పేర్లను కలవరిస్తుంటాడని అన్నాడు. నిద్ర పోతున్నాడా... ధ్యానం చేయడం లేదా అని మోడీ అడిగాడు. కళ్లకు శుభ్రంగా నల్లద్దాలు పెట్టుకుంటే ఆ మాత్రం అర్ధం కావడం లేదా అంటూ వివేకా కళ్లకున్న నల్లద్దాలు తీసాడు. వివేకా నిద్రలోనే రా రకుల్... హాలో బిపాసా... అంటూ కలవరిస్తున్నాడు. వివేకా కలవరింతలతో పక్కనే వున్న చంద్రబాబు, ఏపి మంత్రులు కూడా 'ఓం కారం' మరిచిపోయి సినిమా యాక్టర్ల పేర్లు ఉచ్చరించసాగారు. మోడీకి ఓపిక నశించి అర్జంట్‌గా వీళ్లను ఇక్కడ నుండి పంపించేయండన్నాడు. అందుకు వెంకయ్య... వాళ్లు కూడా వెళ్లాలనే లేండి... రేపు అమరావతి రాజధానిలో వాళ్లు రైతులకు ప్లాట్లు పంపిణీ చేసే పనుందన్నాడు.

★★★★★

అది అమరావతి రాజధానిలోని నేలపాడు గ్రామం. చంద్రబాబుతో పాటు సిఆర్‌డిఏ ఛైర్మెన్ శ్రీకాంత్, రాష్ట్ర మంత్రులు, తెలుగుదేశం నాయకులు పెద్దసంఖ్యలో ఉన్నారు. లాటరీ ద్వారా రాజధానికి భూములిచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయించే పని పెట్టారు. ఒక చార్టుకు రాజధాని ప్లాన్ అంటించారు. సిఆర్‌డిఏ ఛైర్మెన్ శ్రీకాంత్ మ్యాప్‌ను చూపిస్తూ... ఈమధ్యలో అసెంబ్లీ, సచివాలయం వస్తాయి. ఈ పక్క స్టార్ హోటల్స్ వస్తాయి. ఆ పక్క కార్పొరేట్ హాస్పిటల్స్... వాటి పక్కనే సాఫ్ట్‌వేర్ కంపెనీలు... చుట్టూ రింగ్‌రోడ్... మధ్యలో కాలువలు... పార్కులు... మెట్రో రైలు... అని చెబుతూ మీ అందరికీ ఓ మూలన ఆగ్నేయంగా నివాస స్థలాలు ఇవ్వబడతాయని, లాటరీ తీసి నెంబర్ల వారీగా ప్లాట్లు కేటాయిస్తామని చెప్పారు. అది విన్న రైతులు ఆగ్రహంతో ఊగిపోయారు. మా భూములు అసెంబ్లీ పక్కన వుంటే, మా ప్లాట్లు ఓ మూలన పడేస్తారా? మాకు అసెంబ్లీ పక్కనే ప్లాట్లు కావాలని గొడవ చేయసాగారు. ఆ దెబ్బతో చంద్రబాబు తల పట్టుకుని... ఈ రైతులందరినీ అసెంబ్లీ భవనం పక్కన పెడితే, దీనికి సింగపూర్ గ్లామర్ కాదు కదా, నర్సాపూర్ గ్లామర్ కూడా రాదని బాధపడసాగాడు. అసెంబ్లీ చుట్టుపక్కల ఈ రైతులు పంచెలు, బనియన్లు వేసుకుని తిరుగుతుంటే వచ్చిన విదేశీ ప్రతినిధులు చూసి నవ్విపోతారు. ఇదేనా నువ్వు కట్టిస్తానన్న అంతర్జాతీయ ప్రమాణాల స్థాయి రాజధాని అని నన్నే ఎగతాళి చేస్తారని మదనపడసాగాడు. పత్తిపాటి పుల్లారావు వుండి... పోనీ ఇక్కడే రైతులకు ప్లాట్లు ఇచ్చేసి, ప్రతి రైతుకు రెండు సూట్లు ఫ్రీగా ఇద్దాం. ఈ ప్రాంతంలో పంచె, చొక్కాలతో తిరగకూడదని, కేవలం సూటుతో మాత్రమే తిరగాలని కండీషన్ పెడదామని ప్రతిపాదించాడు. ఈ కాలంలో గుడ్డలు విప్పుకుని తిరిగే వాళ్లనే నియంత్రించలేకున్నాం, ఇక సంప్రదాయ బట్టలు ధరించే రైతులను ఎలా నియంత్రించగలమని చంద్రబాబు అన్నాడు. పక్కనే వుండి ఇదంతా విన్న స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా... సార్, మీ సమస్యను నేను తీరుస్తాను, రైతులందరినీ ఓ మూలకు పంపించే విధంగా రియల్ ఎస్టేట్ తెలివితేటలు ప్రయోగిస్తానని చెప్పి... రాజధాని మ్యాప్ వున్న బోర్డు వద్దకు పోయి... రాజధానిలో ప్లాట్లు కొనేందుకు చాలామంది సినిమా యాక్టర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ మూల 52వ నెంబర్ ప్లాట్‌కు ప్రియాంకచోప్రా అడ్వాన్స్ ఇచ్చింది, అవతల బ్లాక్‌లో దీపికా పదుకొనే, దానికి ఎదురుగా వున్న బ్లాక్‌లో నీలిమానిలబడే కొన్నారు. బి-బ్లాక్‌లో కాజల్, నయనతార, శ్రేయ, త్రిష, సచిన్ టెండూల్కర్, విరాట్‌కోహ్లి, అనుష్క శర్మలు వరుసగా కొన్నారని చెప్పాడు. ఆ మాటతో రైతులంతా... మాకూ అక్కడే ప్లాట్లు కావాలని అడగడంతో చంద్రబాబు పని సుఖాంతమైపోయింది. ఇంత సులభంగా ప్రక్రియను పూర్తి చేసే ఐడియాను ఇచ్చినందుకు వివేకాకు చంద్రబాబు, ఇతర మంత్రులు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అంతలో కొంతమంది యువరైతులు వివేకా వద్దకు వచ్చి... సార్, మీరు చెప్పిన హీరోయిన్‌లందరూ ఇక్కడ ఎప్పుడు ఇళ్లు నిర్మాణం మొదలు పెడతారని అడిగారు. దానికి వివేకా... వాళ్లు వారి వృద్ధాప్యంలో ప్రశాంతంగా గడిపేందుకు ఇక్కడ ఇళ్లు కట్టుకోవచ్చు... అందుకు ఇంకా ముప్పై, నలభై ఏళ్లు పడుతుందిలేండి అంటూ లేచాడు. ఆ రైతులు నోరెళ్లబెట్టారు.

# నడుం వంచిన నెల్లూరు

- ప్రతిచోటా 'యోగా' విన్యాసాలు





ఈ నెల 21వ తేదీన 2వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని నెల్లూరుజిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయుష్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అనిల్‌గార్డెన్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎం.జానకి పాల్గొని అందరితో పాటూ ఎంతో చక్కగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ యోగాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు యోగాను ఆదరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏజేసి రాజ్‌కుమార్, డిఎస్‌డిఓ యతిరాజ్, యోగా గురువులు బాషా, సుబ్రహ్మణ్యం, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు అబ్బురపరచాయి. నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ విశాల్‌గున్నీ ఆధ్వర్యంలో పోలీసులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజులో 30 నిముషాలు యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(ఏఆర్) సూరిబాబు, ఏఆర్ డిఎస్పీ చెంచురెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు పాల్గొన్నారు. సంగంలో జరిగిన యోగా వేడుకలలో సినీనటి కళాభినేత్రి వాణిశ్రీ పాల్గొన్నారు. ఆమెను స్థానికులు సత్కరించారు. యోగా వల్ల ప్రయోజనాలను ఆమె ఈ సందర్భంగా వివరించారు. శ్రీహరి కోటలోని షార్‌లో జరిగిన యోగా దినోత్సవంలో షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్, కంట్రోలర్ రాజారెడ్డి, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొని యోగాసనాలు వేశారు.



యోగసనాలు వేస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా, డిఎస్పీ శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, సిఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు

గూడూరులో జరిగిన యోగా దినోత్సవంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, సబ్‌కలెక్టర్ శ్రీ గిరీషా, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, సిఐ శ్రీనివాసరెడ్డిలు పాల్గొని యోగాసనాలు వేశారు.

నెల్లూరు విఆర్‌సి మైదానంలో ఎన్‌సిసి కేడట్లు యోగా ప్రదర్శన నిర్వహించారు. ఇక జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వైద్యకేంద్రాలలో యోగా వేడుకను ఘనంగా నిర్వహించారు.

## కేంద్ర పర్యావరణ కమిటీలో..
# ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యల్లాల వెంకటరామిరెడ్డి(వై.వి.రామిరెడ్డి)ని కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఇండస్ట్రియల్ కమిటీలో ఎక్స్‌పర్ట్ మెంబర్‌గా నియమిస్తూ కేంద్ర పర్యావరణ మరియు అటవీమంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండే పరిశ్రమలకు వాతావరణ, పర్యావరణ అనుమతులు మంజూరు చేయడం మరియు నియంత్రణ చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తానని, ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటు చేసే కేంద్రప్రభుత్వ పరిధిలోని పరిశ్రమలకు త్వరగా అనుమతులు లభించేటట్లు కృషి చేస్తానని ఈ సందర్భంగా రామిరెడ్డి 'లాయర్'కు తెలిపారు. నెల్లూరుజిల్లా వింజమూరు గ్రామానికి చెందిన వై.వి.రామిరెడ్డి విద్యార్థి దశలోనే ఏబివిపిలో చురకైన పాత్ర పోషించారు. ఎస్వీ యూనివర్శిటీ విద్యార్థి సంఘం నాయకుడిగాను, సెనేట్ మెంబర్‌గాను పని చేశారు. ఆయన ఆధ్వర్యంలో 9మంది విద్యార్థులు పిహెచ్‌డిలను, నలుగురు ఎంఫిల్ పట్టాలను అందుకున్నారు. ఆయన తయారు చేసిన 49 రీసెర్చ్ పేపర్స్‌ను జాతీయ, అంతర్జాతీయ టర్నెల్స్‌లో ప్రచురించారు. 33జాతీయ, అంతర్జాతీయ సెమినార్‌లలో ఆయన పాల్గొనడం జరిగింది. డిగ్రీ కోర్సులకు సంబంధించి సిబిసిఎస్‌కు సెమిస్టర్ విధానంలో నూతనంగా తయారు చేసే సిలబస్‌కు యుజిసి ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్స్ కమిటీలోనూ ఆయన సభ్యులుగా వున్నారు. ప్రతిష్టాత్మక బాధ్యతలు చేపట్టిన వై.వి.రామిరెడ్డికి 'లాయర్' అభినందనలు.

# కార్పొరేషన్‌లో న్యాయం జరగడం లేదు

**- నగర ఎమ్మెల్యే అనిల్**




నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ప్రజలకు న్యాయం జరగడం లేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. ఈ నెల 20వ తేదీ విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో పనులు చేయాల్సింది పోయి ఓ హోటల్‌లో కూర్చుని దందాలు చేస్తున్నారన్నారు. సామాన్య పౌరుడు తన ఇంటికి ప్లాను కోసం గత ఆరు నెలలుగా తిరిగి తిరిగి విసుగెత్తి ఏసిబి వారిని ఆశ్రయించాడన్నారు. ఏసిబి అధికారులు దాడులు చేసి పట్టుకునే వరకు కళ్లు తెరవకపోవడం బాధాకరమన్నారు. గత రెండేళ్లుగా కార్పొరేషన్‌లో జరిగే అవినీతిపై విజిలెన్స్ ఎంక్వైరీలు వేస్తే ఇలా చాలా అవినీతి బట్టబయలవుతుందన్నారు. రాష్ట్ర మంత్రికి చిత్తశుద్ధి వుంటే, నీతి నిజాయితీ నిరూపించుకునే సమయం వచ్చిందన్నారు. చిన్నచిన్న అధికారులపై నిందలు మోపి కమిషనర్ లాంటి అధికారులు తప్పించుకోవడం సరికాదని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గోగుల నాగరాజు, ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సింగంపల్లికి శ్రీశ్రీ పురస్కారం



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం తొలిసారిగా ప్రవేశపెట్టిన శ్రీశ్రీ పురస్కారాన్ని ఆదివారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన వున్న హోటల్ యష్‌పార్క్ సమావేశ మందిరంలో ప్రముఖ కవి సింగంపల్లి అశోక్‌కుమార్‌కు అందజేశారు. ఆర్యవైశ్య నాయకులు కోట గురుబ్రహ్మం, చినుకు రాజగోపాల్, కాళిదాసు పురుషోత్తం, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, ఏటూరు నాగేంద్రరావులు అశోక్‌కుమార్‌ను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ పురస్కారాన్ని అందుకున్న అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పురస్కారం తనకు వచ్చినట్లు కాకుండా సమాజానికి శ్రీశ్రీ చేసిన కృషికి ప్రతిఫలంగా తనకు లభించినట్లు భావిస్తున్నానన్నారు. అనంతరం శ్రీశ్రీ రచనలతో తనకున్న అనేక అనుభవాలను నెమరు వేసుకున్నారు. శ్రీశ్రీకి కవిగానే అంతర్జాతీయ సమాజంలో గుర్తింపు వచ్చినా, నిజానికి ఆయన కవిత్వానికి మించి వచనాన్ని చాలా బాగా వ్రాసారని చెప్పారు. శ్రీశ్రీ అనంతం పుస్తకం ఆయన వచన రచనకు, ధైర్యానికి మచ్చుతునక అని పేర్కొన్నారు. శ్రీశ్రీ కవిత్వమే కాక అనేక భావోద్వేగాలు పలికించే సినిమా పాటలు, కథలు, నాటికలు అనేక ప్రక్రియల్లో రచనలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం వివిధ సాహితీ సంఘాలకు చెందిన పది మంది కవులు తమ కవితల్ని వినిపించారు. ఈ సమావేశంలో చినుకు సాహితి మాసపత్రిక సంపాదకులు నందూరి రాజగోపాల్, డాక్టర్ ఈదూరు సుధాకర్, దగ్గుమాటి పద్మాకర్‌లు పాల్గొన్నారు. చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించారు.






# పెంచలకోనకు లక్ష రూపాయల విరాళం



నెల్లూరు గాంధీనగర్‌లోని మోడరన్ స్కిన్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ చర్మవ్యాధి వైద్యనిపుణులు పర్వతరెడ్డి పెంచలరెడ్డి పెంచలకోన లోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి లక్షరూపాయలు విరాళంగా అందజేశారు. తన కుమార్తె మౌనికకు ఉచిత మెడికల్ సీటు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇటీవల తమ కులదైవమైన పెంచలస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఆయన ఈమేరకు విరాళాన్ని అందజేశారు.

### కోస్టల్‌గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్‌కు

# విశాల్ అభినందనలు



ఇండియన్ కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్‌కు ఎంపికైన ఆకుల రాజేష్‌ను ఎస్పీ విశాల్‌గున్నీ అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కమ్యూనికేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏవీయు ప్రసాద్‌రావు కుమారుడే రాజేష్. చిన్నప్పటి నుండి కష్టపడి చదివాడు. పలుమార్లు పోలీసు ప్రతిభా పురస్కారాలను అందుకున్నాడు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్‌లో ఆలిండియా రెండవ ర్యాంకు సాధించాడు. ఎస్పీ తన ఛాంబర్‌లో రాజేష్‌ను అభినందించి విధులు సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు.

# యోగాతో మానసిక వికాసం



యోగా, ధ్యానం వల్ల శారీరక ధారుఢ్యం, మానసిక వికాసంతో పాటు విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి చదువు పట్ల ఆసక్తి ఏర్పడుతుందని రామచంద్ర మిషన్‌కు చెందిన డా॥ ఎ.వి.ఎన్.గంగాప్రసాద్, రాజ్యలక్ష్మి, జయరామాచారి, సుధాకర్‌రావులు అన్నారు. ఈ నెల 21వ తేదీన శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ నిత్యం యోగాసనాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవని, ప్రస్తుత యాంత్రిక జీవన సరళిలో ఎదురయ్యే ఒత్తిడుల నుండి ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల చేత ధ్యానంతో పాటు వజ్రాసనం, పవనముక్తాసనం, ప్రశాంత ఆసనం తదితర ఆసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ డా॥ పెనుబల్లి బాబు నాయుడు, వైస్‌ప్రిన్సిపల్ జె.వి.ఎస్.భాస్కర్, డిప్లొమా ఇన్‌ఛార్జ్ డి.వి.రావు, ఏ.ఓ కృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఓ, పిడి రవి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### బత్తిన లీలావతమ్మ



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం నిడిముసలి గ్రామ వాస్తవ్యులు కీ॥శే॥ బత్తిన సుందర రామిరెడ్డి గారి సతీమణి శ్రీమతి బత్తిన లీలావతమ్మ తమ 84వ యేట జూన్ 21వ తేదీ మంగళవారం నాడు హైదరాబాదులో కనుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు వున్నారు. లీలావతమ్మకు చదువన్నా, చదువుకునే వారన్నా చాలా ఇష్టం. ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులకు తమ ఇంట్లో వసతి కల్పించి చదివించారు. నిడిముసలి గ్రామంలో శిథిలావస్థలో వున్న "రామాలయాన్ని" తన సారథ్యంలో పునరుద్ధరణ చేసి నిత్యం పూజలతో ఆలయం కళకళలాడేలా చేసిన ఘనత లీలావతమ్మది. తమ బంధువర్గానికే కాకుండా సాయం కోరి వచ్చిన వాళ్ళందరికీ కాదనకుండా తనదైన శైలిలో సహాయం చేసిన గొప్ప దానగుణం కలిగిన దయార్థ్ర హృదయం ఆమెది.

ఆమె కుమారులు సుధాకరరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కుమార్తెలు కనకలత, ప్రవీణలు హైదరాబాదులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని సెటిలయ్యారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### కొల్లుకుదురు వనజాక్షమ్మ



నెల్లూరు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పోరెడ్డి అనూరాధ మాతృమూర్తి, ఆర్ అండ్ బి డి.ఇ పోరెడ్డి సుధాకర్‌రెడ్డి అత్తగారైన కొల్లుకుదురు వనజాక్షమ్మ ఈ నెల 22వ తేదీ స్వర్గస్తురాలైనారు. వారి స్వగ్రామం ఆత్మకూరు. ఆమె తన వందవ ఏట కనుమూశారు. ఆమె భర్త శంకర్‌రెడ్డి కూడా 12ఏళ్ళ క్రితం తన 102వ ఏట పరమపదించారు. వనజాక్షమ్మకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఇద్దరూ ఇద్దరే

(మొదటి పేజీ తరువాయి)

మారింది. 2006లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, వివేకాకు ఇష్టం లేకుండానే పులిమి శైలజను మేయర్‌గా చేయాల్సి రావడం జరిగాయి. అక్కడ నుండే నెల్లూరు నగర పాలకసంస్థకు దరిద్రం పట్టినట్లయ్యింది. వివేకా చర్యల మూలంగా సొంత పార్టీ లోనే కుమ్ములాటలు మొదలయ్యాయి. పులిమి శైలజను దించడం కోసం మూడేళ్లు పోరాడిన వివేకా, ఆ సమయం లోనే నగరపాలక సంస్థలో అభివృద్ధికి పోతరేసి, వర్గపోరును తెరకెక్కించాడు. పులిమి శైలజను దించేసి తన అనుచరురాలు భానుశ్రీని మేయర్ పీఠం ఎక్కించాక నెల్లూరు నగరాన్ని ఇష్టారాజ్యంగా మలచుకున్నారు. అవినీతికి అందలం వేశారు. ప్రతి పనికి రేట్లు కుదిర్చారు. కాంట్రాక్ట్ పనుల్లో కమిషన్లు నొక్కారు. తమ కాళ్ల వద్దకొచ్చిన వారి అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాసారు. తమకు గిట్టని వారి నిర్మాణాలను సక్రమంగా వున్నా కూలగొట్టించారు. వివేకా 'ఎస్' అంటే అది అక్రమమైనా సక్రమమే... వివేకా 'నో' అంటే అది సక్రమమైనా అక్రమమే... అన్నంతగా నగరంలో పరిస్థితులు మారిపోయాయి. 'బాస్' ఇచ్చిన చనువుతో వారి ఆస్థాన కార్పొరేషన్ సిబ్బంది కూడా విచ్చలవిడిగా రెచ్చిపోయారు. పిచ్చిపిచ్చిగా సంపాదించారు. కార్పొరేషన్‌ను అవినీతి జమానాగా మలిచిందే వివేకా. ఇప్పుడు ఆయనే అవినీతి ఆరోపణలు చేయడం చూస్తుంటే... కార్పొరేషన్ అక్రమాలపై వగలాడి ఏడుపులు ఏడుస్తుంటే... అన్నీ తెలిసిన నగర పౌరులు నవ్వుకుంటున్నారు.

'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అంటూ అజీజ్ కూడా మేయర్‌గా ఎన్నికైనదే తరువాయి ఆనం బాటలోనే పయనిస్తున్నాడు. వివేకా తన అనుచరురాలు భానుశ్రీకి తన హయాంలో నెల్లూరు నగరాన్ని రాసిస్తే, ఇప్పుడు అజీజ్ తన తమ్ముడు జలీల్‌కు నెల్లూరును దత్తత ఇచ్చాడు. కావాల్సినంత దండుకోమన్నట్లు రాసిచ్చాడు. ప్రతి పనికి, ప్రతి నిర్మాణానికి, ప్రతి అనుమతికి రేట్లు నిర్ణయించి వీళ్లు కలెక్షన్లు దండుతున్నారు. వివేకా అందించిన అవినీతి వారసత్వాన్ని వీళ్లు బాగానే అందిపుచ్చుకున్నారు. కార్పొరేషన్‌ను అవినీతి కేంద్రంగా తీర్చిదిద్దారు.

### కార్పొరేషన్‌పై పట్టు కోసమే...

మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి దాదాపు 20ఏళ్లపాటు నెల్లూరు నగరంలో వెలిగాడు. ఆయన సామ్రాజ్యమే నడిచింది. నెల్లూరు నగరంలో ఆయన ఏదనుకుంటే అది చేయగలిగాడు. తనవాడు అనుకుంటే అడ్డదిడ్డంగా భవనాలు కట్టినవాళ్లకు సైతం ఎన్ఓసిలు వచ్చాయి. పరాయివాడు అన్న వాడి భవంతులు పేకమేడల్లా కూలాయి. గత 20ఏళ్లు ఆయన మాట శిలాశాసనమైంది. ఆయన కరుణిస్తే చాలు నగరంలో ఏ పనైనా అయిపోతుందనే పరిస్థితి ఉండింది. నగరం మీద ఆయనకు ఇంత పట్టు రావడానికి కారణం ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినందువల్ల కాదు. నెల్లూరు నగరపాలక సంస్థలో మేయర్‌లుగా తన వారిని పెట్టుకోవడం వల్లే. నగరపాలక సంస్థలో సభ్యులు తన అనుచరులుండడం వల్ల. నగరపాలక సంస్థ సిబ్బంది కూడా ఎక్కువమంది వారి అనుచరులై ఉండడం, దీనికితోడు పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండడం.

నెల్లూరు పాలక సంస్థలో పట్టు వుంటే చాలు నెల్లూరు నగరమంతా గుప్పిట్లో ఉన్నట్లే! ఎందుకంటే నగరంలో ప్రతి ఒక్కరికీ పనిబడేది కార్పొరేషన్‌తోనే! ఇళ్లు కట్టుకోవాలన్నా, బర్త్ సర్టిఫికేట్, డెత్ సర్టిఫికేట్ కావాలన్నా, కొళాయిలు, డ్రైనేజీ, వీధి లైట్లు... ఇలా ప్రజల అవసరాలు చాలా వరకు నగరపాలక సంస్థతోనే ముడిపడి ఉంటాయి. కాబట్టి నగరపాలక సంస్థపై పట్టుంటే ప్రజల్లో పరపతి పెంచుకోవచ్చు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వివేకా చేసిం దిదే! పేరుకు ఎమ్మెల్యేగా వున్నా ఆయన పరోక్షంగా నిర్వహించిందంతా మేయర్ విధులే!

ఈ కార్పొరేషన్‌కు 20ఏళ్లుగా అలవాటుపడ్డ ప్రాణం. ఇక్కడ అణువణువు తెలుసు. దీని టేస్ట్‌కు అలవాటుపడిపోయాడు. అంత తొందరగా కార్పొరేషన్ మీద అభిమానాన్ని చంపుకోలేడుగా? ఇప్పుడు వివేకా అదే పనిచేస్తున్నాడు. కార్పొరేషన్‌పై మునుపటి పట్టు కోసం తన ప్రయత్నాలు తాను చేస్తున్నాడు. విచిత్రంగా వేషాలు వేసుకుంటూ నోరంతా పెద్దది చేసుకొని అరచి మరీ అవినీతి గురించి మాట్లాడుతున్నాడు. ప్రజలు వివేకా హావభావాలు చూసి నవ్వుకుంటున్నారు.

ఇక, నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అంటూ ఆనం అవినీతి బాటలోనే మేయర్ కూడా వెళుతున్నాడు. కోట్లు ఖర్చుపెట్టి మేయర్ కుర్చీని అతికష్టం మీద దక్కించుకున్న అజీజ్ ఊరుకుంటాడా మరి? కార్పొరేషన్‌లో తనది కాకుండా ఇంకొకరి పెత్తనాన్ని సహిస్తాడా? తాను మేయర్‌గా ఉన్నంతకాలం తన రాజ్యమే నడవాలనుకుంటాడు కదా! ఇక్కడే ఆనం, అజీజ్ వర్గాలు ఘర్షణ పడుతున్నాయి. మధ్యలో మైనార్టీలను కూడా ముగ్గులోకి లాగారు. మైనార్టీలు ఇరు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఇటీవల తెలుగుదేశంలో చేరిన నాయకులు కూడా రెండు వర్గాలుగా విడిపోయారు. ఇప్పుడు నగరపాలక సంస్థలో సభ్యులు తెలుగుదేశం, వైకాపా సభ్యులుగా విడిపోయి అరుచుకోవడం లేదు. అజీజ్, ఆనం వర్గాలుగా విడిపోగా చాలామంది సభ్యులు మాకెందుకొచ్చిన తలనొప్పిలే అని తటస్థంగా ఉంటున్నారు. ఇద్దరి మధ్య పోరు ఇక్కడితో ఆగదు. ఆనంకు ప్రతి రోజూ అజీజ్ మీద బురద చల్లడమే పని. వాళ్లకు అది వెన్నతో పెట్టిన విద్య. పదవీ కాలం ముగిసేదాకా అజీజ్ ఈ బురదను కడుక్కోవడంతోనే సరిపోద్ది!

### 'అ' 'ఆ' మధ్య నారాయణ

అజీజ్‌ను, ఆ తర్వాత ఆనంను తెలుగుదేశంలోకి తీసుకొచ్చింది మంత్రి నారాయణ. ఇప్పుడు వీళ్లిద్దరి మధ్య పోరులో ఆయన నలిగిపోక తప్పదు. ఆయన అటు ఆనంను కాదనుకోలేడు, ఇటు అజీజ్‌ను వదులుకోలేడు. అందుకని ఈ కార్పొరేషన్ వర్గపోరు ఎపిసోడ్‌లో ఆయన 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి' అన్న మార్గాన్ని అనుసరించే అవకాశాలున్నాయి.

# అందరూ ఔట్!

(మొదటి పేజీ తరువాయి)

వైకాపా నుండి తెలుగుదేశంలో చేరడం చూసాం. భూమా నాగిరెడ్డితో మొదలు పెట్టిన వలసలు పలమనేరు ఎమ్మెల్యే ఆకే అమరనాథరెడ్డి దాకా వచ్చాయి. మొత్తం 20అసెంబ్లీలు. కడప, కర్నూలు, కృష్ణా, విజయనగరం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం... అన్ని జిల్లాల నుండి వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి వెళ్లారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో ఇటీవల ఓ సంస్థ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎలా వుంటాయన్న దానిపై సర్వేను నిర్వహించినట్లు సమాచారం. ఈ సర్వే ప్రకారం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకే చంద్రబాబు సీట్లిస్తే ఒక్క పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి తప్పితే మిగతా వాళ్లంతా భారీ మెజార్టీలతో ఓడిపోవడం ఖాయమని తేలిందని భోగట్టా! పలమనేరులో ఇంకా వైసిపికి గట్టి నాయకత్వం లేదు. అక్కడ కూడా మంచి అభ్యర్థి దొరికితే ఫలితం తారుమారు కావొచ్చని సమాచారం.

రెండేళ్ల తర్వాత ఏ ప్రభుత్వం మీదైనా కొంత వ్యతిరేకత వస్తుంది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం మీద అది తీవ్రస్థాయిలోనే వుంది. ఒక పార్టీ నుండి గెలిచి ఇంకో పార్టీలోకి జంప్ చేసిన ఎమ్మెల్యేలపై అది మరింత తీవ్రంగా వుంటుంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహంతోనే ఉంటారు. ఏ పార్టీ ఎమ్మెల్యే ఈ విధంగా ఫిరాయించినా ప్రజలు వారిని ఒకే గాటన జమకడతారు.

2009 ఎన్నికలు కాగానే తెలుగుదేశం అధికారంలోకి రాకపోవడంతో అప్పుడు కోవూరు తెలుగుదేశం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడం తెలిసిందే! వై.యస్. మరణం తర్వాత ఆయన జగన్ స్థాపించిన వైసిపిలో చేరాడు. జగన్ విలువలకు కట్టుబడి ప్రసన్న చేత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాడు. 2012లో కోవూరుకు ఉపఎన్నికలు జరిగితే అంత వై.యస్. సానుభూతి గాలిలోనూ ఈయన కొచ్చిన మెజార్టీ 23వేలే! ఆ గాలిలో 50వేలు మెజార్టీ ఖాయమనుకున్నారు. అదే లోక్‌సభ ఎన్నికలలో వైకాపా ఎంపీగా పోటీ చేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డికి మాత్రం ఒక్క కోవూరు అసెంబ్లీ పరిధిలోనే 50వేల మెజార్టీ వచ్చింది. కేవలం గెలిచి గెలవగానే పార్టీ ఫిరాయించాడని ప్రసన్నపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత వల్లే ఆయన మెజార్టీ పడిపోయింది.

ఫిరాయింపు ఎమ్మెల్యేలను ప్రజలు ఎంత హీనంగా చూస్తారన్న దానికి గత కోవూరు ఉపఎన్నికలే ఒక ఉదాహరణ. ఈ 20మంది ఎమ్మెల్యేలను చంద్రబాబు చేర్చుకోకపోయి వుంటే పరిస్థితి ఇంకో విధంగా వుండేది. 2019 నాటికి ఈ 20మంది ఎమ్మెల్యేలలో సగం మందిపైనైనా వ్యతిరేకత వచ్చేది. ఇది తెలుగుదేశంకు లాభించేది. కనీసం ఈ 20లో సగం సీట్లు తెలుగుదేశంకు గ్యారంటీ ఉండేవి. వీళ్లను తెచ్చి నెత్తిన పెట్టుకున్నందు వల్ల చంద్రబాబు ఇంకొంచెం గబ్బు పట్టడమే కాని, పార్టీకి అదనంగా వచ్చిన ప్రయోజనమేదీ లేదు. కొత్త వారిని నలుగురిని తెచ్చుకుంటే ఇప్పటికే ఉన్నోళ్ల నలభైమంది దూరమవుతున్నారనే విషయాన్ని చంద్రబాబు విస్మరిస్తున్నాడు.


# ఇస్రో..మరో చరిత్ర



రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్, శాస్త్రవేత్తలు

*ఒకప్పుడు ఒక రాకెట్ అంతరిక్షంలోకి వెళ్ళడమే బహు విచిత్రంగా వుండేది. అంత పెద్ద బరువున్న రాకెట్ నింగిలోకి శరవేగంగా దూసుకువెళ్తూండడం చూసి ప్రజలంతా ఎంతో ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు తనతో పాటు, మరిన్ని బరువున్న ఉపగ్రహాలను కూడా తీసుకెళ్ళి కక్ష్యలోకి దిగ్విజయంగా వదులుతుండడం చూస్తే.. శాస్త్రవేత్తల అద్భుత విజయాలు ఔరా అన్పిస్తున్నాయి. మన ప్రధాని నరేంద్రమోడీ అన్నట్లుగా, పక్షుల్ని ఒకేసారి నింగిలోకి ఎగురవేసినట్లుగా 20 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించాం".. ఏదేమైనా, ఇంతటి ఘనత పిఎస్ఎల్‌వి సి-34కి దక్కింది..దానిని విజయవంతంగా రోదసిలోకి పంపిన ఇస్రోకి దక్కింది. ఈ విజయం శాస్త్రవేత్తలకే కాదు.. భారతీయులందరికీ గర్వకారణం.*

శ్రీహరికోటలో వున్న సతీష్‌ధవన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం రెండవ ప్రయోగవేదిక మీదినుంచి ఇస్రో బుధవారం ఉదయం సరిగ్గా 9.26 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి) సి-34 రాకెట్‌ను నింగిలోకి పంపింది. కేవలం 26 నిమిషాల 30 సెకన్ల వ్యవధిలోనే అది కక్ష్యలోకి దూసుకుపోయింది. భూమికి 505 కిలోమీటర్ల ఎత్తులో 20 ఉపగ్రహాలను ప్రవేశపెట్టింది. వీటిలో 13 ఉపగ్రహాలు అమెరికాకు చెందినవి కావడం విశేషం. అంతేకాదు, కెనడాకు చెందిన 2 ఉపగ్రహాలను, జర్మనీ-ఇండొనేషియాలకు చెందిన 2 ఉపగ్రహాలతో పాటు, మనదేశానికి చెందిన మరో 3 ఉపగ్రహాలను సైతం తీసుకువెళ్ళి కక్ష్యలో దిగ్విజయంగా విడిచిపెట్టి అపూర్వమైన విజయం సాధించి.. శెభాష్ ఇస్రో అన్పించుకుంది. భారత్‌కు చెందిన కార్టోశాట్-2, సత్యభామా శాట్, స్వయం శాట్, ఇండోనేషియాకు చెందిన లపాన్ ఏ-3, జర్మనీకి చెందిన బీరోస్, కెనడాకు చెందిన ఎం 3 ఎం శాట్, జిహెచ్‌జి శాట్, అమెరికాకు చెందిన స్కై శాట్‌లతో పాటు అమెరికాకు చెందిన మరో 12 డవ్ ఉపగ్రహాలను పిఎస్ఎల్‌వి సి-34 ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఘనతను ఇస్రో సాధించింది. దీంతో శ్రీహరికోటలోని శాస్త్రవేత్తల్లో విజయానందం వెల్లివిరిసింది. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తదితరులంతా ఇస్రో శాస్త్రవేత్తల కృషిని అభినందిస్తూ..ఇది అద్భుత విజయమని అభివర్ణించారు. షార్‌లోని ప్రజలే కాక, జిల్లా ప్రజానీకం..రాష్ట్ర ప్రజలంతా ఈ అద్భుతవిజయానికి ఎంతో ఆనందించారు.



**అంతరిక్ష పరిశోధనల్లో భారత్ మరో చరిత్ర సృష్టించింది. ఒకేసారి 20 ఉపగ్రహాలను కక్ష్యలోకి దిగ్విజయంగా పంపి ఎంతో అరుదైన.. ఆపూర్వమైన విజయాన్ని సొంతం చేసుకుంది. మనదేశంలో జరిగే అంతరిక్ష పరిశోధనల్లో ఇంతటి ఘన విజయం ఇదే తొలిసారి. రష్యా, అమెరికా తర్వాత ఇన్ని ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపిన దేశంగా భారత్ ప్రపంచవ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంది. అతిపెద్ద ప్రయోగాన్ని అత్యద్భుతంగా నిర్వహించిన ఇస్రోకి... ఇది చరిత్రాత్మక విజయం.**

## ఇస్రోకి అంతర్జాతీయ ఖ్యాతి :

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో ఎన్నో ఘనవిజయాలను సాధిస్తూనే వుంది. అన్నిటికీ మించి తాజాగా సాధించిన విజయం మరెంతో చరిత్రాత్మకం. 20 ఉపగ్రహాలను ఒకేసారి కక్ష్యలోకి పంపిన దేశంగా భారత్‌కు అంతర్జాతీయస్థాయి ఖ్యాతి రావడం మనందరికీ గర్వకారణం. ఒకే రాకెట్ ద్వారా అత్యధిక సంఖ్యలో ఉగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్ళిన దేశాల్లో రష్యా మొదటి స్థానంలో వుంది. 2014లో 37 ఉపగ్రహాలను రష్యా విజయవంతంగా కక్ష్యలోకి పంపంగా, అమెరికా 2013లో 29 ఉపగ్రహాలను పంపింది. రష్యా, అమెరికాల తర్వాత మూడవ స్థానం ఇప్పుడు భారత్ కైవశం చేసుకోవడం అపూర్వమే. 20 ఉపగ్రహాలను ఒకేసారి కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఒక విశేషమైతే, కోరుకున్న విధంగా వేరువేరు చోట్ల వాటిని ప్రవేశపెట్టడం మరో విశేషమని ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మెన్ ఎ.ఎస్ కిరణ్‌కుమార్ అన్నారు. షార్‌లో బుధవారం జరిగిన రాకెట్ ప్రయోగం విజయానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పిఎస్ఎల్‌వి సి-34 ఎంతో విశిష్టమైన ప్రయోగమన్నారు. త్వరలో పిఎస్ఎల్‌వి సి-35 రాకెట్‌ను పంపనున్నామని, దీనిద్వారా స్కాట్‌శాట్, ఆల్‌శాట్ ఉపగ్రహాలతో పాటు, మరో అయిదు విదేశీ ఉపగ్రహాలను, మరో రెండు భారతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులు రూపొందించిన ఉపగ్రహాలను కూడా ప్రయోగించ నున్నామని ఆయన వెల్లడించారు. మనకు 13 భూ పరిశీలన, మరో 13 సమాచార ఉపగ్రహాలు, 7 నావిగేషన్ ఉపగ్రహాలు, 2 అంతరిక్ష అధ్యయన ఉపగ్రహాలు వున్నాయని, వీటిద్వారా సాధారణ ప్రజల ముఖ్య అవసరాలు ఏవిధంగా తీర్చగలమనే దిశగా అధ్యయనం జరుగుతోందని అన్నారు. ఏదేమైనా.. ఇస్రో శాస్త్రవేత్తలు అంతరిక్ష విజ్ఞానంలో రాకెట్‌లా దూసుకుపోతుండడం ఎంతో అభినందనీయం..20 ఉప్రగహాలను దిగ్విజయంగా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశ పెట్టి అద్భుత విజయం సాధించి ఒక్క షాట్‌తో 20 హిట్స్ కొట్టి.. అంతరిక్ష విజ్ఞాన రంగంలో భారత్ మరోసారి జయకేతనం ఎగురవేసినందుకు ఇస్రో శాస్త్రవేత్తలు.. అధికారులు.. షార్ సిబ్బంది.. అందరికీ శుభాభినందనలు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com